## కొత్త పార్టీ పెడుతున్న మస్క్


- ట్రంప్ కు బిగ్ షాక్
- ది అమెరికా పార్టీ పేరుతో ప్రకటన
- ఎక్స్ లో పోల్.. 56లక్షల మంది ఓట్లు.. 80శాతం మద్దతు



02

## మహారాష్ట్ర మ్యాచ్ ఫిక్సింగ్ బిహార్‌కు..

- అక్కడి ఎన్నికల్లో బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడింది
- రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే రిపీట్
- మ్యాచ్ ఫిక్సింగ్ ఏ ప్రజాస్వామ్యానికైనా విషం లాంటిదే
- ఎక్స్ లో కాంగ్రెస్ రాహుల్ గాంధీ
- రాహుల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఎలక్షన్ కమిషన్



03

## కేసీఆర్‌పై అభాండాలు

- కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయి
- కాళేశ్వరం కమిషన్ పేరిట డ్రామా చేస్తున్నారు
- నిందలు, దందాలు, చందాలు.. ఇదే కాంగ్రెస్ పాలన
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌పై ఒక్క కేంద్ర మంత్రి కూడా మాట్లాడరా?
- నీళ్ల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ దుష్ప్రచారమే ఇది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



03

Follow: @ANNTELUGU

08-06-2025

# మహా పత్రిక

ANN తెలుగు

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 186 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వరప్రదాయినిగా బిఆర్ఎస్ పార్టీ తాను అధికారంలో ఉన్న పదేళ్ళు ప్రచారం చేసింది. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాజెక్టును ప్రపంచ అద్భుతాల్లో ఒకటిగా పేర్కొన్నారు. కాళేశ్వరం ఫిల్లర్ల కుంగుబాటు నాటినుండీ బిఆర్ఎస్ పార్టీకి కష్టాలు మొదలయ్యాయి. ఇపుడు విచారణ కమిషన్ ముందుకు కేసీఆర్, హరీష్ వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ ముసురుకుకున్న వివాదం తెలంగాణ రాజకీయాల్లో వేడి పుట్టిస్తోంది. కాళేశ్వరం వివాదంతో బీఆర్ఎస్‌ను దెబ్బతీస్తూనే, మూసీ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌లోని పట్టణ ఓటర్లను, పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రయత్నంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. కాళేశ్వరంపై దుష్ప్రచారం జరుగుతోందని బిఆర్ఎస్ వరుస ప్రజంటేషన్ల ద్వారా ప్రజలకు వివరించే ప్రయత్నాలు చేస్తున్నది. అటు కాళేశ్వరం, ఇటు మూసీ చుట్టే తెలంగాణ రాజకీయాలు తిరుగుతున్నాయి.

- తాజా రాజకీయాలపై ఎఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్

ఎడిటోరియల్ పేజీ 4లో




# కాళేశ్వరంపై సీబీఐ

## వాడివేడిగా మాటల యుద్ధం

- హరీష్ మరోసారి పవర్ పాయింట్ ప్రజంటేషన్
- రేపు కమిషన్ ముందుకు హరీష్
- కేసీఆర్ కు ఈటల క్లీన్ చిట్ ఇవ్వలే కిషన్ రెడ్డి
- సీబీఐ విచారణకు కిషన్ రెడ్డి డిమాండ్.. ఈటలపై తుమ్మల ఫైర్..
- కాళేశ్వరం ప్రాజెక్టు ఏనాడూ కేబినెట్ ఆమోదానికి రాలేదు
- కమిషన్ ముందు అబద్ధాలు చెప్పిన రాజేందర్

కాళేశ్వరంపై మాటల మంటలు రేగుతున్నాయి. జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ తుదిదశకు చేరిన నేపథ్యంలో నేతల మధ్య హాట్ డిస్కషన్స్ జరుగుతున్నాయి. లక్షన్నర కోట్ల ప్రాజెక్టులో.. తెరవెనుక సంగతులు, అక్రమాలు, అవినీతి, నిర్లక్ష్యం, ప్రజాధనంపై బాధ్యత లేకపోవడం వంటి వ్యవహారాలన్నీ ఇపుడు చర్చనీయాంశంగా మారాయి. ఓ వైపు ఆర్ధికమంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ విచారణ పూర్తయిన నేపథ్యంలో నీటిపారుదల శాఖా మంత్రిగా పనిచేసిన హరీష్ రావు హాజరుకాక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో హరీష్ మరోసారి ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

- మహా, హైదరాబాద్

వివరాలు 2లో



## ఈటల చెప్పినవి అసత్యాలే

- కమిషన్‌కు ఇచ్చిన వాగ్మూలం అసత్యం
- కాళేశ్వరం ప్రాజెక్టు ఏనాడూ కేబినెట్ ఆమోదానికి రాలేదు
- వచ్చినట్లు ఏమైనా ఆధారాలు రాజేందర్ ఇప్పడే చూపించాలి
- ఎంపీ ఈటల రాజేందర్‌కు మంత్రి తుమ్మల సవాల్
- ఈ ఇష్యూలోకి నన్నెందుకు లాగుతున్నారని తుమ్మల ఫైర్

02

## కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరగాలి



- ఎన్ డీఎస్ఏ రిపోర్టు తప్పెలా అవుతుంది
- కాంగ్రెస్ చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం లేదు
- మీడియాతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

02

# కేబినెట్‌లోకి వివేక్.. కవ్వంపల్లి

## బీసీ కోటాలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి ఛాన్స్

కొత్తగా ముగ్గురు .. అందరికీ తొలిసారే ఛాన్స్

నేడు రాజ్ భవన్ లో ప్రమాణస్వీకారం

సుదర్శన్ రెడ్డి కోసం నిజామాబాద్ నేతల ప్రయత్నాలు



హైదరాబాద్, మహా

తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమైంది. ఆదివారం ఉదయం దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది. కేబినెట్‌లో కొత్తగా ముగ్గురికి అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్థానిక ఎన్నికల వేళ ఎలాంటి గొడవలకు తావు లేకుండా వ్యూహాత్మకంగా కొత్త వారికి అవకాశం ఇచ్చారు. బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు ఈ విస్తరణలో చోటు కల్పించినట్లు తెలుస్తోంది. ఏఐసీసీ అధిష్టానం అనేకసార్లు కసరత్తులు జరిపిన అనంతరం కాంగ్రెస్ పార్టీకి సంప్రదాయబద్ధంగా ఉన్న ఎస్సీ ఓటర్లను పూర్తిగా తన వైపుకు మళ్ళించుకునేందుకు దళితులకు చరిత్రలో ఏ కేబినెట్ లోనూ దక్కని ప్రాధాన్యత ఇవ్వాలని డిసైడైంది. ప్రస్తుతం 11మంది మంత్రుల్లో ఇద్దరు ఎస్సీలు ఉండగా, తాజాగా మరో ఇద్దరు చేరితే ఈ సంఖ్య 4కు పెరుగుతుంది. తెలంగాణ కేబినెట్ లో 25 శాతానికి పైగా దళితులకే ఛాన్స్ ఇచ్చినట్లు అవుతుంది. రెడ్డి, దళిత, మైనారిటీలు ఆది నుండీ కాంగ్రెస్ పార్టీకి స్థిరమైన ఓటుబ్యాంకుగా ఉన్నారు. మధ్యలో పలు కారణాల వల్ల వివిధ సామాజికవర్గాలు అటు ఇటు వెళ్ళినా ఇపుడు పూర్తిగా ఏకం చేసే

మిగతా 2లో

# దళారీ దందాకు చెక్..

## వడ్డీ వ్యాపారుల నడ్డి విరిస్తున్న పోలీసులు

- జనాలను మోసం చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా
- తాజాగా రైతుల వేషంలో వెళ్లి పలువురిని పట్టుకున్న వైనం
- కేసులు నమోదు చేసి కటకటాల పాలు
- పోలీసుల పనితీరుపై సర్వత్రా ప్రశంసలు

06



# దద్దరిల్లిన బీజాపూర్ అడవులు

## ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్

- భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోలు మృతి
- మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు
- ఘటనాస్థలిలో భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు సీజ్
- బీజాపూర్ నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో ఘటన

**మహా:** ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం గత కొన్ని రోజులుగా కాల్పుల మోతతో దద్దరిల్లింది. బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో శనివారం మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య భీకర ఎదురు కాల్పులు జరిగాయి. పోలీసుల ఎదురు కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందగా.. పలువురు గాయపడినట్లు సమాచారం. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా గత కొన్ని రోజులుగా భద్రతా దళాలు ఛత్తీస్ గఢ్‌లోని అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. ఈ క్రమంలోనే శనివారం బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలకు మావోయిస్టులు తారసపడ్డారు.

మిగతా 2లో




# బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఫిక్స్!

## కాళేశ్వరం స్కామ్‌లో కేసీఆర్ ఫ్యామిలీని కాపాడే ప్లాన్

- ఆనాడు విమర్శించినోళ్లు ఇప్పుడు మద్దతు ఇస్తున్నారా?
- హరీశ్ రావు, ఈటల రాజేందర్ భేటీపై అనుమానాలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాట్ కామెంట్స్

**మహా:** బీజేపీలో బీఆర్ఎస్ విలీనమయ్యేందుకు తెర వెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సంచలన ఆరోపణ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని, కల్వకుంట్ల కుటుంబాన్ని అవినీతి ఆరోపణల నుంచి కాపాడే ప్రయత్నం చేస్తోందని వ్యాఖ్యానించారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారిందని, అందులో భారీ అవినీతి జరిగిందని స్వయంగా ప్రధానమంత్రి

మిగతా 2లో



# పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- కాంగ్రెస్ లో చేరిన పలువురు బీఆర్ఎస్ నేతలు

06

# కాళేశ్వరంపై సీబీఐ

**హైదరాబాద్, మహా:**

కాళేశ్వరంపై మాటల మంటలు రేగుతున్నాయి. జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ తుదిదశకు చేరిన నేపథ్యంలో నేతల మధ్య హాట్ డిస్కషన్స్ జరుగుతున్నాయి. లక్షన్నర కోట్ల ప్రాజెక్టులో.. తెరవెనుక సంగతులు, అక్రమాలు, అవినీతి, నిర్లక్ష్యం, ప్రజాధనంపై బాధ్యత లేకపోవడం వంటి వ్యవహారాలన్నీ ఇపుడు చర్చనీయాంశంగా మారాయి. ఓ వైపు ఆర్థికమంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ విచారణ పూర్తయిన నేపథ్యంలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్ రావు హాజరుకాక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో హరీష్ మరోసారి ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కాళేశ్వరం ను బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందనేది వాస్తవమని, ఈ అక్రమాలను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వెలికి తీయడంలో వెనక్కు తగ్గింది కాబట్టి ప్రజలకు పూర్తి వాస్తవాలు తెలియాలంటే సీబీఐ విచారణ ద్వారానే సాధ్యమవుతుందని కిషన్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఎంపీ ఈటల రాజేందర్ అదే చెప్పారన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో కర్త, కర్మ, క్రియ అన్నీ కేసీఆర్ అని ఆయన స్పష్టంగా తెలిపారన్నారు. మొదటి నుంచి కేసీఆర్ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అక్రమాలకు బాధ్యుడని పేర్కొన్నారని, కమిషన్ ముందూ అదే చెప్పారన్నారు. ఇక ఈటల రాజేందర్ కేసీఆర్ ను వెనకేసుకొచ్చారని, కేబినెట్ ముందుకు ఏనాడు రాని ప్రాజెక్టును కేబినెట్ ఆమోదంతో చేపట్టారని పేర్కొనడం విస్మయం కలిగిస్తున్నదన్నారు. ఈటల ఎందుకు అలా చెప్పాడో తనకు తెలియదన్నారు.

**కాళేశ్వరం కమిషన్ ఎదుట బాంబ్ పేలుస్తా**
**నా దగ్గర కీలక డాక్యుమెంట్ ఉంది.. కమిషన్ కు ఇస్తా**
**జేబు సంస్థలా మారింది**

కాళేశ్వరం కమిషన్ ఎదుట బాంబ్ పేలుస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు సంచలన ప్రకటన చేశారు. ఈ రోజు చేసిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కాకుండా.. తన దగ్గర ఒక కీలక డాక్యుమెంట్ ఉందన్నారు. 9న కమిషన్ ముందు హాజరైన తర్వాత




అక్కడే మీడియాకు విడుదల చేస్తానన్నారు. కాళేశ్వరం లేకుండా యాసంగిలో పంటలు పండాయని ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ఆయన, కాళేశ్వరం వల్లనే యాసంగిలోనూ పంటలు పండాయని ఉద్ఘాటించారు. మొత్తంగా కాళేశ్వరం ద్వారా 20 లక్షలకు పైగా ఎకరాలకు నీరందించామన్న హరీశ్‌రావు, ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీలో 2 పిల్లర్లు మాత్రమే కుంగాయన్నారు. అంతమాత్రాన మొత్తం ప్రాజెక్టు కూలినట్లు చెప్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. కాళేశ్వరం కమిషన్ నోటీసులు, ప్రాజెక్టులపై విపక్షాల విమర్శల వేళ నీటి పారుదల శాఖ మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాళేశ్వరంతో 17 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తేవటంతో పాటు 30 లక్షల ఆయకట్టును స్థిరీకరించామని పేర్కొన్నారు. కాళేశ్వరం తెలంగాణకు జీవధార అని పేర్కొన్న ఆయన, కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణలో గోదావరి 312 కి.మీ మేర సజీవంగా ఉండేలా చేశామన్నారు. కాళేశ్వరం అంటే మూడు బ్యారేజీలు మాత్రమే కాదన్న హరీశ్ రావు, ఈ ప్రాజెక్టు ద్వారా 240 టీఎంసీల నీటి వినియోగం జరిగిందన్నారు.

**అందువల్లే మేడిగడ్డకు మార్చాం**

ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగేళ్లలో అనుమతులు కూడా సాధించలేదన్న, హరీశ్‌రావు తమ్మిడిహట్టి వద్ద సరైన నీటి లభ్యత లేకపోవటం, ప్రాజెక్టుకు మహారాష్ట్ర ఒప్పుకోకపోవటం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని మేడిగడ్డకు మార్చామని తెలిపారు. అంతర్రాష్ట్ర సమస్యలు ఉన్నచోట ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును నాటి కాంగ్రెస్ సర్కారు డిజైన్ చేసిందన్న ఆయన, కాళేశ్వరం ప్రాజెక్టుకు మహారాష్ట్ర అభ్యంతరం చెప్పకుండా చర్చలు జరిపినట్లు వెల్లడించారు. భూముల ధరలు పెరగడం, పరిహారం పెంపు వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80 వేల కోట్ల నుంచి రూ. 94 వేల కోట్లకు పెరిగిందని హరీశ్‌రావు వివరించారు. ప్రతిపక్షాలు కక్షపూరితంగానే మాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, అన్ని అనుమతులతోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించామన్నారు. రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని, ఇప్పుడు దుష్ప్రచారం చేస్తున్న ప్రతిపక్ష నాయకులే తెలంగాణ నీళ్ల కష్టాలు కాళేశ్వరం ద్వారానే తీరాయని గతంలో కొనియాడారని గుర్తు చేశారు. కాళేశ్వరం కమిషన్ ముందుకు వెళ్తాం, అన్ని విషయాలు చెప్పి కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొడతామని హరీశ్‌రావు అన్నారు. మేడిగడ్డలో 2 పిల్లర్లు మాత్రమే కుంగాయన్న హరీశ్‌రావు, ఒక బ్యారేజీలో 2 పిల్లర్లు కుంగితేనే మొత్తం ప్రాజెక్టు కూలినట్లు చెప్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం లేకుండా పంటలు పండాయని కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందన్న మాజీ మంత్రి, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వేలాది చెరువులు నింపొచ్చని అన్నారు. కాళేశ్వరం వల్లనే యాసంగిలోనూ పంటలు పండాయని స్పష్టం చేశారు.

**కమిషన్లకు భయపడతామా?**

మేడిగడ్డ కుంగిన తర్వాత కూడా భారీ వరద, భూకంపం వచ్చినా బ్యారేజీ చెక్కు చెదరలేదన్న హరీశ్, ఏడో బ్లాకును నిర్మిస్తే మళ్లీ వాడుకోవచ్చని ఎన్‌డీఎస్ఏనే చెప్పిందని గుర్తు చేశారు. ఎన్‌డీఎస్ఏ కూడా సీబీఐ, ఈడీలాగా బీజేపీకి జేబు సంస్థలా మారిందన్న ఆయన, పోలవరంలో డయా ఫ్రమ్ వాల్ కొట్టుకుపోతే వెళ్లని ఎన్‌డీఎస్ఏ రాష్ట్రం అడగకపోయినా మేడిగడ్డకు రెండు రోజుల్లోనే వచ్చిందని గుర్తు చేశారు. అన్ని విషయాలు చెప్పి కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొడతామన్న హరీశ్‌రావు, ప్రాణత్యాగానికే సిద్ధపడిన వాళ్లం, కమిషన్లకు భయపడతామా? అని అన్నారు.

# కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరగాలి

## ఎన్ డీఎస్ఏ రిపోర్టు తప్పెలా అవుతుంది

### కాంగ్రెస్ చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం లేదు

### మీడియాతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, కుంగిపోవడం తదితర అంశాలన్నింటిపై సీబీఐ విచారణ జరిపించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిగి బాధ్యులపై చర్యలు తీసుకుంటారన్న నమ్మకం లేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ అవినీతిపై విచారణ జరిపిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని పదే పదే ప్రకటించిన ప్రస్తుత సీఎం ఏడాదిన్నర దాటినా ఎలాంటి విచారణ జరిపించడం లేదని, ఎవరిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగింది వాస్తవమని, అయితే ఈ అక్రమాలను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వెలికి తీయడంలో వెనక్కు తగ్గింది కాబట్టి ప్రజలకు పూర్తి వాస్తవాలు తెలియాలంటే సీబీఐ విచారణ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఎంపీ ఈటల రాజేందర్ అదే చెప్పారన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో కర్త, కర్మ, క్రియ అన్నీ కేసీఆర్ అని ఆయన స్పష్టంగా తెలిపారన్నారు. మొదటి నుంచి కేసీఆర్ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అక్రమాలకు బాధ్యుడని పేర్కొన్నారని, కమిషన్ ముందూ అదే చెప్పారన్నారు. కేసీఆర్ మీద చర్యలు తీసుకోవాలని ఈటెల చెప్పారన్నారు. మాజీ మంత్రిగా ఈటల రాజేందర్ ను విచారణకు పిలిచిందని, బీజేపీ నేతగా పిలవలేదన్నారు. మంత్రిగా తానున్న కాలంలో ఏం ఝరిగిందన్న విషయాన్ని ఈటల కమిషన్ కు చెప్పారన్నారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి అవినీతికి పాల్పడిన మంత్రులు, ఎమ్మెల్యే ల పై చర్యలు తీసుకుంటామని చెప్పారని, ఇంతవరకు ఎవరిపై ఎవరిపై చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ కు పగుళ్ళు వచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎన్ డీఎస్ ఏ రిపోర్ట్ తప్పు ఏవిధంగా అవుతుందో మాడజీ మంత్రి హరీష్ రావు చెప్పాలన్నారు. అందుకే ఈ వ్యాఖ్యలన్నింటికీ పూర్తి సమాధానం రావాలంటే సీబీఐ దర్యాప్తు జరిగితేనే ఫుల్ స్టాప్ పడుతుందన్నారు. కేసీఆర్ కుటుంబ అక్రమాలని ప్రశ్నించాడు కాబట్టే ఈటల బయటికి వచ్చాడని అన్నారు. లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణ ప్రజల కి ఎంత వరకు పనికొచ్చిందో గత పాలకులే చెప్పాలన్నారు.

**బనకచర్లపై మరోసారి కేంద్రానికి రేవంత్ లేఖ రాయాలి**

బనకచర్ల ప్రాజెక్టుపై కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బనకచర్ల విషయంలో కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి మరో లేఖ రాయాలని సూచించారు.



తెలంగాణకు అన్యాయం జరగడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. గత వారం ఏపీ ప్రభుత్వం డీపీఆర్ ఇచ్చింది. కేంద్రం ఇంకా ఆ నివేదికను పరిశీలించలేదు. ఆవేమీ తెలుసుకోకుండా కేంద్రంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కేంద్రం పెద్దన్న పాత్రలో ఉంది కాబట్టి.. ఇరువైపులా ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఒకరికి అన్యాయం, మరొకరికి న్యాయం చేసేలా కేంద్రం వైఖరి ఎప్పుడూ ఉండదు. కేంద్రం ఎల్లప్పుడూ నిష్పక్షపాతంగా ఉంటుందని అన్నారు.

**రాష్ట్రంలో అధికారంలోకి రావడమే నా అజండా**

తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకుఅావడమే తన ఎజండా అని కిషన్ రెడ్డి చెప్పారు., త్వరలో జరుగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర పీఠాన్ని బీజేపీ అధిష్టించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రోజురోజుకూ బీజేపీకి తెలంగాణ బలం పెరుగుతుందని, అసెంబ్లీ ఎన్నికల నాటికి ఆ బలం నిరూపితమవుతుందన్నారు.

# ఈటల చెప్పినవి అసత్యాలే

## కమిషన్‌కు ఇచ్చిన వాగ్మూలం అసత్యం

- కాళేశ్వరం ప్రాజెక్టు ఏనాడూ కేబినెట్ ఆమోదానికి రాలేదు
- వచ్చినట్లు ఏమైనా ఆధారాలు రాజేందర్ ఇప్పుడే చూపించాలి
- ఎంపీ ఈటల రాజేందర్‌కు మంత్రి తుమ్మల సవాల్
- ఈ ఇష్యూలోకి నన్నెందుకు లాగుతున్నారని తుమ్మల ఫైర్



**హైదరాబాద్, మహా**

కాళేశ్వరం వివాదంలోకి తనను కావాలని లాగుతున్నారా? అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశ్నించారు. కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అబద్ధాలు చెప్పారన్నారు. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సెక్రటేరియట్ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. ఎంపీ ఈటల ప్రస్తావించిన సబ్ కమిటీ కాళేశ్వరం కోసం వేసింది కాదని, మేడిగడ్డకు అనుమతులు ఇచ్చిన తర్వాత కమిటీ వేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు, సబ్ కమిటీకి సంబంధం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పెండింగ్ ప్రాజెక్టులపై మాత్రమే సబ్ కమిటీ వేశారు. తాను సుమోటోగా కమిషనర్ దగ్గరకు వెళ్లాలనుకుంటున్నానని, సబ్ కమిటీ నిర్ణయాలను కమిషన్ ముందు ఉంచుతానని తుమ్మల తెలిపారు. చాలా రోజులు అయింది కాబట్టి అనాలోచితంగా ఇచ్చారో తెలీదన్నారు. 'కమిషన్ అడిగిన ప్రశ్నలకు సంబంధం లేని, పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. కాళేశ్వరం నిర్మాణం కోసం ఏర్పాటు కోసం వేసిన సబ్ కమిటీ కాదు. మేడిగడ్డ, ప్రాణహిత, కడ్మో పెండింగ్ ప్రాజెక్టులపై సబ్ కమిటీ వేశారు. కాళేశ్వరంపై సబ్ కమిటీ లేదు.. రిపోర్ట్ ఇవ్వలేదు. సబ్ కమిటీకి.. కాళేశ్వరం నిర్మాణానికి సంబంధం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం పొందినట్లు ఈటల రాజేందర్ చెప్పారు.. అది వాస్తవం కాదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం నిర్మాణం కోసం క్యాబినెట్ ఆమోదానికి ఎప్పుడూ రాలేదు అని తేల్చి చెప్పారు.

**వాంగ్మూలం చాలా బాధాకరం..**

ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లతో మాత్రమే కాళేశ్వరం నిర్మాణం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. ఈటల చెప్పిన విషయాలు ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకు వెళ్లాయి.. అలా తప్పుడు సంకేతాలు వెళ్ళొద్దనే నేను మీ ముందుకు వచ్చాను.. ఆ తప్పును ఈటల ఎందుకు తన భుజాల మీదకు వేసుకోవాల్సి వచ్చిందో అర్థం చేసుకోవాలని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈటలకు తప్పుడు ఆలోచన ఎందుకు వచ్చిందో తెలీదు. 43 ఏళ్లుగా పద్ధతితో, నిబద్ధతతో రాజకీయాలు చేస్తున్నాను. నా వ్యక్తిత్వం ఈటల రాజేందర్‌కు తెలుసు. ఈటల రాజేందర్ స్టేట్‌మెంట్ చూశాక కొంత బాధేసింది. ఈటల రాజేందర్ ఇలా అబద్ధాలు చెప్పాల్సిన అవసరం ఏం వచ్చిందో తెలీదు. సబ్ కమిటీ రిపోర్ట్‌ను కమిషన్‌కు ఇస్తాను. నాకు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధం లేదు. ఈటల రాజేందర్ వాంగ్మూలం చాలా బాధాకరం'' అని తుమ్మల వ్యాఖ్యానించారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఈటల చెప్పిన సమాధానాలు చూసి బాధ, అనుమానం వ్యక్తమయ్యాయి.. నేనే సుమోటోగా కాళేశ్వరం కమిషన్‌కు సబ్ కమిటీ రిపోర్టు, ఇతర వివరాలు అందిద్దామని అనుకుంటున్నాను.. కాళేశ్వరం నిర్మాణానికి నాకు సంబంధం లేదని తేల్చి చెప్పారు. ఇంకా హరీశ్ అబద్ధాలు ఆడాలని చూస్తే.. అబద్ధాల హరీశ్ అవుతాడు అని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం విషయం క్యాబినెట్ ముందుకు వచ్చినట్లు ఏదైనా ఆధారాలు ఉంటే చూపండి అని మంత్రి తుమ్మల సవాల్ విసిరారు.

### 500 మంది జనాభా 3 కిలోమీటర్ల దూరం ఉంటేనే

# కొత్త పంచాయితీ

### ఇప్పట్లో కొత్త జీపీలు లేనట్లే

### నిబంధనల మేరకు ఏర్పాటుకు సాధ్యం కాదంటున్న అధికారులు

**మహా :** కొత్త పంచాయతీల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది. గత ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లు పంచాయతీలు ఏర్పాటు చేయడంతో ఎన్నో సమస్యలు వస్తున్నాయని ఆరోపిస్తున్నది. ఈ మేరకు కొత్త పంచాయతీల ఏర్పాటుకు పక్కా మార్గదర్శకాలను రూపొందించి ముందుకెళ్లాలని నిర్ణయించింది. ప్రధానంగా 500 కంటే తక్కువ జనాభా ఉన్న పల్లెలను పంచాయతీలుగా మార్చడంతో ప్రభుత్వానికి అదనపు భారమే తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని అధఇకారులు అంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్త పంచాయతీల ఏర్పాటు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి ప్రభుత్వానికి పెద్దసంఖ్యలో ప్రతిపాదనలు వచ్చాయి. కొత్త పంచాయతీలు ఏర్పాటు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లు నేతలు చెప్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై వీళ్లంతా ఒత్తిడి తీసుకొస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పంచాయతీల కోసం 250 వరకు పంచాయతీరాజ్ శాఖకు దరఖాస్తులు వచ్చాయి. అప్లికేషన్లతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సు లేఖలు కూడా జతచేసి ఉన్నాయి. దీనిపై పంచాయతీరాజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయి నుంచి వివరాలు తెప్పించారు. చాలా దరఖాస్తులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లేకపోవడంతో పెండింగ్ లో పెట్టినట్లు తెలిసింది.

**3 కిలో మీటర్ల దూరం ఉండాలి**

రాష్ట్రంలో ప్రస్తుతం 12,777 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్త పంచాయతీల కోసం సుమారు 250 దరఖాస్తులు రాగా అందులో 37 గ్రామాల్లో మాత్రమే 500 జనాభా ఉన్నట్లు తేలింది. మిగిలిన గ్రామాల్లో 500 లోపు జనాభా ఉంది. వికారాబాద్ జిల్లాలోని ఓ నియోజకవర్గంలో కేవలం 90 కుటుంబాలు ఉన్న ఓ పల్లెను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని అక్కడి ఎమ్మెల్యే సిఫార్సు లేఖ పంపినట్లు తెలిసింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేయాలంటే కనీసం 500 జనాభా ఉండాలని, పల్లెకు, పల్లెకు మధ్య 3 కిలో మీటర్ల దూరం ఉండాలని పంచాయతీరాజ్ చట్టంలో స్పష్టంగా ఉంది. దీంతో ఇలాంటి దరఖాస్తులను పెండింగ్ లో పెట్టారు. త్వరలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కొత్త పంచాయతీల ఏర్పాటు సాధ్యం కాదని పంచాయతీరాజ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# దద్దరిల్లిన బీజాపూర్ అడవులు

(మొదటిపేజీ తరువాయి)

ఇరువర్గాల మధ్య ఎదురు కాల్పులు జరగగా.. ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నట్లు తెలిపారు. ఘటనా స్థలంలో భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బీజాపూర్ నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇక ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చే ప్రమాదం ఉందని పౌర హక్కుల సంఘం నేతలు చెబుతున్నారు. కొద్ది రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావు, సుధాకర్ ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన మైలారపు ఆదేళ్లు అలియాస్ భాస్కర్ ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 5 నుంచి జరుగుతున్న ఎదురుకాల్పుల్లో మొత్తం ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపూర్ ఎస్పీ వెల్లడించారు. మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇందులో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించాల్సి ఉందన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి రెండు ఏకే 47 రైఫిళ్లు సహా పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

**పార్టీ అగ్ర నాయకులు ఒక్కొక్కరుగా..**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు పార్టీ అగ్ర నాయకులు ఒక్కొక్కరు నేలకొరుగుతున్నారు. ఈ మధ్య కాలంలో పెద్ద సంఖ్యలో నాయకుల మృతితో ఆ పార్టీ కోలుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నది. సిద్ధాంత, రాజకీయ అనుభవంతో పాటు పార్టీకి దిక్సూచిలా పనిచేసిన ముఖ్య నాయకులు ప్రాణాలు కోల్పోవడం, అందులోనూ.. దశాబ్దాల కాలంలో పోలీసుల వేటకు చిక్కని నాయకులు ఇలా ఎన్‌కౌంటర్‌లలో విగతజీవులై పడి ఉన్న ఫొటోలు వారి అభిమానులను నివ్వెరపరుస్తున్నది. ఈ దేశ పౌరులను సాయుధ బలగాలు మట్టు పెట్టడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. రాజ్యాంగబద్ధ ప్రభుత్వం బహిరంగ ప్రకటనలు చేసి మరీ మావోయిస్టులను నిర్మూలించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను సైతం బంధువులకు ఇవ్వకుండా అనామకుల మాదిరి కాల్చి వేయడంపై తీవ్ర అభ్యంతరాలు, విమర్శలు వెల్లువెత్తాయి.

# కొత్త పార్టీ పెడుతున్న మస్క్

## ట్రంప్ కు బిగ్ షాక్

- ది అమెరికా పార్టీ పేరుతో ప్రకటన
- ఎక్స్ లో పోల్.. 56 లక్షల మంది ఓట్లు.. 80శాతం మద్దతు



**మహా:** ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు పెద్ద షాకిచ్చారు. ఊహించని రీతిలో ఎలన్ మస్క్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కొత్త పార్టీ పెట్టడానికి డిసైడ్ అయ్యారు. ఈ మేరకు పార్టీ పేరు కూడా అనౌన్స్ చేశారు. తన కొత్త పార్టీకి 'ది అమెరికా పార్టీ' అని పేరు పెట్టారు. పార్టీ పెట్టడానికంటే ముందు మస్క్ ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఎక్స్ ఖాతాలో ఓ పోల్ పెట్టారు. 'మధ్యలో ఉన్న 80 శాతం మంది కోసం అమెరికాలో ఓ కొత్త పార్టీ పెట్టడానికి ఇది సరైన సమయమేనా?' అని ప్రశ్నించారు. జూన్ 5వ తేదీ రాత్రి 11.27 గంటలకు పోల్ పెట్టగా కొన్ని లక్షల మంది దానిపై స్పందించారు. ఇప్పటి వరకు 90.1 మిలియన్ వ్యూస్ వచ్చాయి. 56 లక్షలకుపైగా మంది ఓట్లు వేశారు. 80.4 శాతం మంది అమెరికాలో కొత్త పార్టీ అవసరం ఉందని, 19.6 శాతం మంది అవసరం లేదని ఓటు వేశారు. పోల్ తుది ఫలితాలపై శనివారం మస్క్ ఓ పోస్టు పెట్టారు. మధ్యలో ఉన్న 80 శాతం మంది కోసం అమెరికాలో ఓ కొత్త పార్టీ పెట్టడానికి ఇది సరైన సమయమేనా? అన్న దానిపై ప్రజలు స్పందించారు. దీనికి 80 శాతం మంది సానుకూలంగా స్పందించారు. ఇది విధి' అని పేర్కొన్నారు. అనంతరం మరో పోస్టులో కొత్త పార్టీ పేరు అనౌన్స్ చేశారు. 'ది అమెరికా పార్టీ' అని తెలియజేశారు. మస్క్ కొత్త పార్టీ ప్రకటన ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇది నిజంగా ట్రంప్‌కు భారీ దెబ్బ . గత కొన్నేళ్ల నుంచి మస్క్ అన్ని రకాలుగా ట్రంప్‌కు మద్దతుగా నిలుస్తూ వచ్చారు. ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ గెలుపుకు ఎంతో కష్టపడ్డారు. ఇద్దరి మధ్యా గొడవతో రిపబ్లిక్ పార్టీకి కూడా నష్టం జరగనుంది.

# కేబినెట్‌లోకి వివేక్.. కవ్వంపల్లి



(మొదటిపేజీ తరువాయి)

దిశగా వ్యూహరచన చేసినట్లు కూర్పు స్పష్టం చేస్తున్నది.

**ఆ ముగ్గురు వీరే**

- **మాల** - చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి
- **మాదిగ** - మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- **ముదిరాజ్** - మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆదివారం ఉదయానికి మంత్రివర్గంలోకి తీసుకునేవారి పేర్లపై అధికారికంగా స్పష్టత వచ్చే అవకాశముంది. ఆదివారం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహణకు గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం 1గంటకు ప్రమాణస్వీకారం ఉండే అవకాశం ఉంది. మరోవైపు నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో కచ్చితంగా చోటు ఇవ్వాల్సిందేనని కొందరు నేతలు పట్టుబడుతున్నట్టు సమాచారం. ఆదిలాబాద్ కోటా ఈ దఫా పూర్తి కానుండగా, మాదిగ, ముదిరాజ్ లకు పెద్దపీట వేసిన సంకేతం వెళ్ళనుంది.

**హైదరాబాద్, నిజామాబాద్ మరోసారి**

హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాలకు మరోసారి కేబినెట్ లో స్థానం కల్పించవచ్చని చెబుతున్నారు. ప్రధానంగా స్థానిక ఎన్నికలను పరిగణనలోకి తీసుకుని సామాజిక కూర్పు చేసినట్లు తెలుస్తోంది. నిజామాబాద్ నుండి సుదర్శన్ రెడ్డికి తొలి విడతలోనే దక్కాల్సి ఉండగా, రెడ్డి సామాజికవర్గ నేతలు ఎక్కువమంది అయ్యారని పెండింగ్ పెట్టారు. ఆ పెండింగ్ కు ఏడాదిన్నర అయింది. ఇపుడు సామాజిక కూర్పు అడ్డు వచ్చిందన్న ప్రచారముంది. నిజామాబాద్ నేతలంతా ఏకగ్రీవంగా సుదర్శన్ రెడ్డికి మద్దతుగా నిలిచినా పదవి లో జాప్యం జరుగుతోంది. ప్రయత్నాలు ఫలిస్తే ఆయనకు ఛాన్స్ దక్కు అవకాశముంది.

### బీజేపీలో బీఆర్ఎస్

# విలీనం ఫిక్స్!


(మొదటిపేజీ తరువాయి)

నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అనేక సందర్భాల్లో విమర్శించారని ఆయన గుర్తు చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ నేత హరీశ్ రావు, బీజేపీ నేత ఈటల రాజేందర్ మధ్య జరిగిన సమావేశం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోందని అన్నారు. గతంలో తీవ్ర విమర్శలు చేసిన బీజేపీ నేతలు ఇప్పుడు అందుకు విరుద్ధంగా మాట్లాడుతుండటం ఆ రెండు పార్టీల మధ్య బంధం బలపడుతోందనడానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ కవిత చెప్పినట్లుగా బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కాబోతోందా? ఈ రెండు పార్టీలు కుమ్మక్కై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దొంగ దెబ్బ తీయాలని చూస్తున్నాయని మేము ఎప్పటినుంచో చెబుతున్నామని ఆది శ్రీనివాస్ అన్నారు. ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.. కాళేశ్వరం ప్రాజెక్టుపై గతంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఇప్పుడు ఈటల రాజేందర్ వ్యతిరేకిస్తున్నారా అని ప్రశ్నించారు. డీపీఆర్‌కు భిన్నంగా మేడిగడ్డ ప్రాజెక్టును ఐదు కిలోమీటర్ల దూరం ఎందుకు జరిపారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం అంచనా వ్యయాన్ని రూ.30 వేల కోట్ల నుంచి ఏకంగా లక్ష కోట్లకు ఎందుకు పెంచారని నిలదీశారు. కాళేశ్వరం అవినీతి ఆరోపణల నుంచి కేసీఆర్ కుటుంబాన్ని బయటపడేసేందుకే బీజేపీ ఇలాంటి ఎత్తుగడలు వేస్తోందని ఆయన ఆరోపించారు. గతంలో కాళేశ్వరం నిర్మాణం మొత్తం కేసీఆర్ ఇష్టానుసారమే జరిగిందని, ఆయన తక్షణమే రాజీనామా చేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారని ఆయన గుర్తు చేశారు. "మరి ఇప్పుడు మంత్రివర్గం నిర్ణయం ప్రకారమే ప్రాజెక్టు నిర్మించారని ఈటల ఎందుకు అంటున్నారు? బీజేపీ గతంలో చేసిన ఆరోపణలపై ఇప్పుడు ఎందుకు యూటర్న్ తీసుకుంది?" అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాళేశ్వరం విషయంలో బీజేపీ నిజాయతీగా వ్యవహరించాలని, ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

ANN తెలుగు



మహా పత్రిక



03

ఆదివారం, హైదరాబాద్ | 08-06-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

# మహారాష్ట్ర మ్యాచ్ ఫిక్సింగ్ బిహార్‌కు..

## అక్కడి ఎన్నికల్లో బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడింది

- రాబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే రిపీట్
- మ్యాచ్ ఫిక్సింగ్ ఏ ప్రజాస్వామ్యానికైనా విషం లాంటిదే
- ఎక్స్ లో కాంగ్రెస్ రాహుల్ గాంధీ సంచలన పోస్ట్
- రాహుల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఎలక్షన్ కమిషన్

**మహా:** గత ఏడాది జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడిందని, రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే పునరావృతమవుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. అందులో ఒక వార్తాపత్రికలో ప్రచురితమైన తాను రాసిన ఒక వ్యాసాన్ని షేర్ చేశారు. 'ఎన్నికలను ఎలా రిగ్గింగ్ చేయాలి? 2024లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని రిగ్గింగ్ చేయడానికి బ్లూప్రింట్ గా నిలిచాయి. అంచెలంచెలుగా ఇది ఎలా జరిగిందో నా వ్యాసం చూపిస్తుంది' అని ఆ పోస్ట్ లో తెలిపారు.

**స్టెప్ బై స్టెప్ వివరణ:**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను బీజేపీ ఎలా రిగ్గింగ్ చేసి గెలిచిందో రాహుల్ గాంధీ స్టెప్ బై స్టెప్ వివరించారు. అవి ఇలా ఉన్నాయి.

**దశ 1:** ముందుగా ఎన్నికల కమిషన్ ను నియమించడానికి ఏర్పాటైన ప్యానెల్ ను రిగ్ చేస్తారు.

**దశ 2:** నకిలీ ఓటర్లను జాబితాలో చేరుస్తారు.

**దశ 3:** ఓటింగ్ శాతాన్ని కృత్రిమంగా పెంచుతారు.

**దశ 4:** బీజేపీ కచ్చితంగా గెలవాల్సిన చోట బోగస్ ఓటింగ్‌ను లక్ష్యంగా చేసుకుంటారు.

**దశ 5:** సాక్ష్యాలను దాచేస్తారు అంటూ రాహుల్ గాంధీ వివరించారు. రిగ్గింగ్ అనేది మ్యాచ్ ఫిక్సింగ్ లాంటిదని, అది మోసం చేసే జట్టును గెలిపిస్తుందని వ్యాఖ్యానించారు. 'కానీ, అది ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేస్తుంది. ప్రజల నమ్మకాన్ని నాశనం చేస్తుంది' అన్నారు. సంబంధిత భారతీయ పౌరులందరూ సమాధానాలు కోరాలని, సాక్ష్యాలను మదింపు చేసేటప్పుడు పరిస్థితిని స్వయంగా అంచనా వేయాలని ఆయన కోరారు. మహారాష్ట్ర మ్యాచ్ ఫిక్సింగ్ తర్వాత బిహార్‌కు వస్తుందని, ఆ తర్వాత ఎక్కడ బీజేపీ ఓడిపోయే పరిస్థితి ఉంటే అక్కడ మ్యాచ్ ఫిక్సింగ్ ప్రారంభమవుతుంది' అన్నారు. అయితే, మ్యాచ్ ఫిక్సింగ్ ఎన్నికలు ఏ ప్రజాస్వామ్యానికైనా విషం లాంటివని రాహుల్ గాంధీ హెచ్చరించారు.

**తీవ్రంగా ఖండించిన ఈసీ..**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 'మ్యాచ్ ఫిక్సింగ్' జరిగిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన సంచలన ఆరోపణలను భారత ఎన్నికల సంఘం (ఈసీ) తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలు పూర్తిగా అసంబద్ధమైనవని, నిరాధారమైనవని పేర్కొంటూ గట్టిగా బదులిచ్చింది. ఈ మేరకు గత ఏప్రిల్‌లో ఇచ్చిన వివరణాత్మక పత్రాన్ని మరోసారి విడుదల చేసింది.

# కేసీఆర్‌పై అభాండాలు

## కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయి

- కాళేశ్వరం కమిషన్ పేరిట డ్రామా చేస్తున్నారు
- నిందలు, దందాలు, చందాలు.. ఇదే కాంగ్రెస్ పాలన
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌పై ఒక్క కేంద్ర మంత్రి కూడా మాట్లాడరా?
- నీళ్ల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ దుష్ప్రచారమే ఇది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**మహా:** రాష్ట్రంలో ప్రస్తుతం నిందలు, దందాలు, చందాలు.. ఇదే కాంగ్రెస్ పాలన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యానించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర రైతాంగానికి, రైతాంగ ప్రయోజనాలకు ఎప్పటికైనా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అన్నారు. నీళ్ల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లలో ఒక దగ్గర పగుళ్లు వస్తే దాన్ని పట్టుకొని దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ వాళ్లు అంటే.. దాన్ని పట్టుకొని దుడ్డెని కట్టేయమని బీజేపీ వాళ్లు అంటున్నారని సెటైర్లు వేశారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్ రావు ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి శీర్షిక నీళ్లు, నిధులు, నియామకాల అని గుర్తు చేశారు. అందుకే పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం ఈ మూడు రంగాల్లో సంపూర్ణమైన న్యాయం చేసిందని, నీళ్ల విషయంలో కృష్ణా, గోదావరిలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి చుక్క నీటిని వదలకుండా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును కాలంతో పోటీపడి కట్టినా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని దాదాపు 90 శాతం పూర్తిచేసినా, సీతారామ ప్రాజెక్టును కూడా 90 శాతం పూర్తిచేసి తెలంగాణ రైతాంగం ప్రయోజనం కోసం కేసీఆర్ సర్కార్ నిరంతరం పనిచేసిందన్నారు. ఇవాళ రాష్ట్రంలో జరుగుతున్న నిందలు, దందాలు, చందాలు. బీఆర్ఎస్ మీద నిందలు, బిల్డర్లు కాంట్రాక్టర్లతో దందాలు, రాహుల్ గాంధీకి చందాలు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పని ఇది అంటు మండిపడ్డారు కేటీఆర్.

**మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడరా?**

గుజరాత్‌లో మార్బీ అనే ప్రాంతంలో ఒక పెద్ద బ్రిడ్జి కూలి పోయి 140 మంది చనిపోయినా ఏ ఎన్‌డీఎస్ఏ, ఏజెన్సీ పోదని కేటీఆర్ అన్నారు. ఆ 140 మంది చావులకు ఫలానా వాడు బాధ్యుడని ఏ ఏజెన్సీ గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ మాట్లాడదని దుయ్యబట్టారు. బీహార్‌లో నాలుగు రోజులకి ఒక బ్రిడ్జి కూలిపోతున్నా అడిగే నాథుడు లేడన్నారు. . అదే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోయి రూ.100 కోట్లు నష్టం జరిగితే ఎన్‌డీఎస్ఏ రాదని, అలానే అవినీతి, కమీషన్ల కక్కుర్తితో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలిపోయి 8 మంది చనిపోయినా.. ప్రమాదం జరిగి 100 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి, కేంద్రంలో ఉండే ఒక్క మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడరని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే వట్టెం పంప్ హౌస్ మునిగిపోయినా, పెద్దవాగు ప్రాజెక్ట్ రెండుసార్లు కొట్టుకుపోయినా అడిగేవాడు లేడన్నారు. కానీ కాళేశ్వరంలో 100 కాంపోనెంట్స్ ఉంటే ఒక్క మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లలో ఒక దగ్గర పగుళ్లు వస్తే దాన్ని పట్టుకొని దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ వాడు అంటే దాన్ని పట్టుకొని దుడ్డెని కట్టేయమని బీజేపీ వాళ్లు రెండు రోజుల్లో ఎన్‌డీఎస్ఏ రిపోర్టును వారి పార్టీ ఆఫీసులో తయారు చేశారు ప్రజలను భ్రమింపచేసే ప్రయత్నం చేశారు. దానికి తిరుగులేని విధంగా ఎల్ అండ్ టీ సంస్థ ఎన్‌డీఎస్ఏ నివేదికను తిరస్కరిస్తున్నామని స్పష్టం చెప్పింది. అది చెత్త బుట్టలో పడేయడానికి తప్ప ఎందుకు పనికి రాదని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీని కట్టిన సంస్థ పనికి రానిదైతే ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని అదే సంస్థతో ఎందుకు కట్టించారని రేవంత్ రెడ్డిని నిలదీశారు కేటీఆర్. కాంగ్రెస్ కార్యాలయాన్ని కూడా తెలంగాణ నుంచి పోయిన మూటలతో కట్టారని అందరికీ తెలుసన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- కాంగ్రెస్ లో చేరిన పలువురు బీఆర్ఎస్ నేతలు



**మహా:** భవిష్యత్తు ముందు రోజుల్లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ ప్రతిష్టను పెంచాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూరు మండలం దేగం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రంగోనీ శ్రీనివాస్ గౌడ్, దుబాయ్ శ్రీకాంత్ లు ఇద్దరూ బిఆర్ఎస్ పార్టీని వదిలి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. పాత నాయకులు, కొత్తగా చేరిన నాయకులు కలిసిమెలిసి పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను పెంచుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బంపర్ మెజారిటీతో గెలిపించాలన్నారు.



# మేయర్ విజయలక్ష్మికి వేధింపులు!


- అర్ధరాత్రి ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడిన అగంతకుడు
- మేయర్‌తో పాటు, ఆమె తండ్రి అంతు చూస్తానంటూ బెదిరింపులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న బంజారాహిల్స్ పోలీసులు

మహా: నగర ప్రథమ పౌరురాలు, మేయర్ గద్వాల విజయలక్ష్మికి కొందరు గుర్తు తెలియని అగంతకులు ఫోన్ చేసి తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ పరిణామం నగర రాజకీయ వర్గాల్లో.. ప్రజల్లోనూ తీవ్ర దుమారం రేపింది. ప్రజా జీవితంలో ఉన్న నాయకుల భద్రతపై ఇది కొత్త చర్చకు దారితీసింది. మేయర్ గద్వాల విజయలక్ష్మి ఈ అమానుష బెదిరింపులపై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదులో.. అపరిచితులు రోజూ అర్ధరాత్రి వేళ ఫోన్‌లు చేసి.. ఆమెను, ఆమె తండ్రి, సీనియర్ రాజకీయ నేత కే. కేశవరావును కూడా 'అంతు చూస్తా' అంటూ ప్రాణహాని తలపెడుతున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా.. అత్యంత అసభ్యకరమైన పదజాలంతో.. బూతులు తిడుతూ మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆమె వాపోయారు. ఫోన్లలో అసభ్యకరంగా మాట్లాడటంతో పాటు.. వాయిస్ మెసేజ్‌లు కూడా పంపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజా సేవలో ఉన్న ఒక మహిళా నాయకురాలికి ఇలాంటి అవమానాలు ఎదురవడం తీవ్రంగా ఖండించదగిన విషయం.

# మేడిగడ్డ బ్యారేజీలో ఆరుగురు యువకుల గల్లంతు

## కొనసాగుతున్న సహాయక చర్యలు

**కాటారం, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మేడిగడ్డ ప్రాజెక్టు లో స్నానానికి వెళ్లిన ఆరుగురు యువకులు గల్లంతయ్యారు. అంబటిపల్లిలో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. అంబటిపల్లి గ్రామానికి చెందిన నలుగురు, కొర్లకుంట గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు శనివారం సాయంత్రం మేడిగడ్డ బ్యారేజ్ గోదావరి నదిలో స్థానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు గోదావరిలో గల్లంతు అయ్యారు. అంబటిపల్లి గ్రామానికి చెందిన పట్టి వెంకటస్వామి ఇద్దరు కుమారులు పత్తి మధుసూదన్ (18),పట్టి శివ మనోజ్ (15), తోకరి రాజు కుమారుడు తొగరి రక్షిత్(13), కర్నాల సమ్మయ్య కుమారుడు కర్నాల సాగర్ (16), కొర్లకొండ గ్రామానికి చెందిన పండు (18), రాహుల్ (19), 8 మంది యువకులు గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లారు. గోదావరి స్నానానికి వచ్చి గల్లంతు కావడం జరిగింది. సంఘటన స్థలాన్ని మహాదేవపూర్ ఎస్ఐ పవన్ కుమార్ పరిశీలిస్తున్నారు. గల్లంతమైన యువకుల కొరకు గాలింపు చర్యలు చేపట్టడం జరుగుతుంది. మెరిగడ్డ బ్యారేజ్ నిర్మాణ సమయంలో తీసిన పెద్ద మడుగులో నీళ్లు ఉన్నాయి. ఆ నీటిలో స్నానం చేయడానికి వెళ్లిన యువకులు ప్రమాదవశాత్తు అందులోనే మునిగిపోయారు. ఆరుగురు నీటిలో గల్లంతుగా మరో ఇద్దరు యువకులు ప్రాణాలతో బయటపడ్డారు. గల్లంతయిన ఆరుగురు యువకులు మరణించినట్లుగానే భావిస్తున్నారు. మృతదేహాల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు గోదావరి నది తీరంలో యువకుల కుటుంబ సభ్యుల రోదనలు ఈ ప్రాంత ప్రజలను మనోవేదనకు గురి చేస్తున్నాయి. సరదాగా స్నానానికి వెళ్లిన యువకులు చివరకు గల్లంతై మృత్యు ఒడిలోకి వెళ్లడంతో తీవ్ర విశాదం నెలకొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనే గతంలో కనివిని ఎరుగని రీతిలో జరిగిన సంఘటన సంచలనంగా మారింది.




# సోనియా గాంధీకి అస్వస్థత!

- సిమ్లాలోని ఐజీఎంసీకి తరలింపు
- వైద్య పరీక్షలు నిర్వహించిన డాకర్లు.. నిలకడగా ఆరోగ్యం

**మహా:** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ అస్వస్థతకు గురికావడంతో హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలోని ఇందిరాగాంధీ మెడికల్ కాలేజ్ (ఐజీఎంసీ) ఆసుపత్రికి తరలించారు. ప్రైవేటు పర్యటన నిమిత్తం సిమ్లాలో ఉన్న సోనియా గాంధీ చారాబ్రాలోని ప్రియాంక గాంధీ నివాసంలో ఉంటున్నారు. శనివారం ఉదయం సమయంలో స్వల్ప అస్వస్థతకు గురైన సోనియాగాంధీని వెంటనే సిమ్లాలోని ఆస్పత్రికి తరలించారు. స్పెషలిస్ట్ డాక్టర్ల బృందం ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సోనియా గాంధీని చెకప్ కోసం ఆసుపత్రికి తీసుకువచ్చి పూర్తి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఐజీఎంసీలోని ఒక సీనియర్ వైద్యుడు ధ్రువీకరించారు. 'ఆమె రక్తపోటు కొద్దిగా ఎక్కువగా ఉంది. కానీ ఆమె స్థిరంగా ఉంది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. స్వల్ప అనారోగ్య సమస్యల కారణంగా సాధారణ చెకప్ కోసం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమెను పరీక్షిస్తున్నారు' అని హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు (మీడియా) నరేష్ చౌహాన్ తెలిపారు.

# ఈ 8 రంగాలకు ఏఐ ముప్పు

## మరో ఐదేళ్లలో ఊహించని విధ్వంసం




**మహా :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) దూసుకెళ్తోంది. ఇది సమీప భవిష్యత్తులో ఉద్యోగాలకు కూడా ముప్పు కలిగిస్తుంది. ఇటీవలి నివేదిక ప్రకారం.. రాబోయే ఐదు సంవత్సరాలలో ఏఐ ఎనిమిది వేర్వేరు రంగాలలో ఉద్యోగాలను నాశనం చేయగలదు. ఇది సేవా పరిశ్రమలో తీవ్రమైన ఆందోళనను రేకెత్తిస్తోంది. డ్రైవింగ్ నుండి కోడింగ్ వరకు, ఏఐ విస్తృత శ్రేణి స్థానాలను తొలగించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. సరళంగా చెప్పాలంటే, ఏఐ ఒక రూపక 'భస్మాసుర'గా మారవచ్చు, దానిని రూపొందించిన వారి ఉద్యోగాలు కూడా డేంజర్‌లో ఉన్నాయి.

**ఎనిమిది రంగాలకు ముప్పు**

వివిధ నివేదికలలో చెప్పినట్లుగా ఐబీఎం వంటి కంపెనీలు ఇప్పటికే నియామకాల కోసం ఏఐ ఏజెంట్లను నియమించడం ప్రారంభించాయి. హెచ్ఆర్ రంగం ఏఐ పురోగతికి అతీతం కాదని సూచిస్తుంది. ఐబీఎం అడుగుజాడలను అనుసరిస్తూ, అనేక సంస్థలు తమ నియామక ప్రక్రియల కోసం ఏఐ సాంకేతికతలను స్వీకరించే అవకాశం ఉంది. డ్రైవింగ్ పరిశ్రమలో ఉద్యోగాలను కూడా ఏఐ ప్రమాదంలో పడేస్తుందని పరిశోధకులు సూచిస్తున్నారు. స్వయం ప్రతిపత్త వాహనాల అభివృద్ధి కొనసాగుతోంది, అవి పూర్తిగా పనిచేసిన తర్వాత, ఏఐ మీ వ్యక్తిగత డ్రైవర్‌గా పనిచేయగలదు, రాబోయే ఐదు సంవత్సరాలలో చాలా మంది డ్రైవర్ల అవసరం లేకుండా చేస్తుంది. కోడింగ్ రంగం తీవ్రంగా దెబ్బతింటుంది. గూగుల్ జెమిని డీప్ రీసెర్చ్ వంటి సాధనాలను ప్రవేశపెట్టడంతో, ఏఐ ఇప్పుడు మీ తరపున కోడింగ్ చేయగలదు. ప్రాథమిక కోడింగ్ పనులను త్వరలో ఏఐ నిర్వహించగలదని నివేదికలు సూచిస్తున్నాయి, ఈ రంగంలోకి ప్రవేశించే కొత్తవారికి గణనీయమైన సవాళ్లు ఎదురవుతున్నాయి.ఏఐ భద్రతా రంగంలో ఉద్యోగాలకు ముప్పు కలిగిస్తుంది ఎందుకంటే ఇది వ్యక్తిగత సైబర్ సెక్యూరిటీ అసిస్టెంట్‌గా పని చేయగలదు, వ్యక్తులు పెద్ద ఎత్తున సైబర్ మోసాలను నివారించడంలో సహాయపడుతుంది. ఇ మెయిల్ నివేదికలు, రోజువారీ పనులు, మరిన్నింటిని నిర్వహించగల ఏఐ సాంకేతికతల వల్ల వ్యక్తిగత సహాయకులు లేదా కార్యదర్శులు కూడా తమ పాత్రలను తగ్గించుకోవచ్చు. ఆన్‌లైన్ సందేశాలను పంపడం నుండి విచారణలకు ప్రతిస్పందించడం వరకు ఏఐ ప్రతిదానినీ ఆక్రమించుకుంటుంది కాబట్టి అమ్మకాలలో ఉద్యోగాలు కూడా ప్రమాదంలో ఉన్నాయి. ఉత్పత్తి జాబితాలు, కస్టమర్ కమ్యూనికేషన్‌ల కోసం ఏఐ సాధనాలను ఉపయోగించుకోవడానికి ఇకామర్స్ వ్యాపారాలు సిద్ధంగా ఉన్నాయి. అంతేకాకుండా, రాబోయే ఐదు సంవత్సరాలలో రెస్టారెంట్ పరిశ్రమలోకి ఏఐ ప్రవేశించవచ్చు, ఆర్డర్ తీసుకోవడం, రసీదు ఉత్పత్తి, వంటలను వడ్డించడం వంటి పనులను ఆటోమేట్‌గా చేస్తుంది. ముఖ్యంగా, కోల్‌కతా, లండన్ వంటి నగరాలు ఇప్పటికే ఆహారాన్ని అందించడానికి రోబోలను ఉపయోగిస్తున్నాయి. చివరగా, ఏఐ ప్రభావం సోషల్ మీడియాలో బ్రాండింగ్, కంటెంట్ మేనేజ్‌మెంట్ వరకు విస్తరించింది, అంటే ఏఐ సాంకేతికత మరింత విస్తృతంగా మారుతున్నందున ఈ రంగాలలోని ఉద్యోగాలు కూడా అంతరాయాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది.



# డీఏలన్నీ విడుదల చేయాలి

- ఉద్యోగులను ప్రభుత్వం కించపరిచింది
- వారికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్

**మహా:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం కించపరిచిందని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. శనివారం జగిత్యాలలో ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వారిని విస్మరించిందన్నారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేస్తామని చెప్పి కేవలం ఒక్క డీఏ విదిల్చారని, ప్రభుత్వం తీరుపై ఉద్యోగులంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, బాధపడుతున్నారని అన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే నెరవేర్చాలని, పెండింగ్ డీఏలన్నీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# గోసంరక్షణ ముసుగులో మత రాజకీయాలు

- బీజేపీకి బక్రీద్ పండుగకు మాత్రమే గుర్తుకొస్తుందా?
- ఏడాదంతా వేలకు వేలుగా గోవులు తరలిస్తున్నా పట్టించుకోరా?
- ఈ వివాదాన్ని కొనసాగించాలన్నదే ఎన్డీయే పక్షాల అజెండా
- ఎక్స్ లో ఎమ్మెల్సీ విజయశాంతి తీవ్ర వ్యాఖ్యలు



**మహా:** బీజేపీపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గోసంరక్షణ ముసుగులో బీజేపీ మత రాజకీయాలు, విభజన రాజకీయాలు సాగిస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. బక్రీద్ పండుగ సమయంలో మాత్రమే బీజేపీకి, దాని మిత్రపక్షాలకు గోసంరక్షణ గుర్తుకొస్తుందని, మిగిలిన ఏడాదంతా వేలకు వేలుగా గోవులు కబేళాలకు తరలిపోతున్నా పట్టించుకోరంటూ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ఒకవేళ ఒకటీ అరా ఆపినా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని రక్తపాతం సృష్టించడం చూస్తూనే ఉన్నామని విమర్శించారు. బక్రీద్ తరుణంలో కొందరు గోవులను దొంగచాటుగా కబేళాలకు తరలించే అవకాశం ఉందన్న ఆరోపణలు ఎవరిని ఉద్దేశించి చేశారో కానీ.. ఒక మతం పేరిట ఇలాంటి విభజన పూర్తిగా ఖండనీయమని పేర్కొన్నారు. గోవును జాతీయ ప్రాణిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని బీజేపీయే ఒక వర్గంతో డిమాండ్ చేయిస్తుంది కానీ.. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు ఆ పని ఎన్నటికీ చెయ్యదని కామెంట్స్ చేశారు. ఎందుకంటే గోసంరక్షణ సమస్య పరిష్కారం కంటే, రాజకీయంగా ఈ వివాదాన్ని అలాగే కొనసాగించడం బీజేపీతో పాటు ఎన్డీయే పక్షాల అజెండా అంటూ ఎమ్మెల్సీ విజయశాంతి వ్యాఖ్యలు చేశారు.

# ఎంపీ ఈటల పాత్ర జీరో

- కాళేశ్వరం డిజైన్ కేసీఆర్ వ్యక్తిగత నిర్ణయం
- నిజం మాట్లాడినందుకే ఈటలను బయటకు పంపారు
- 18 నెలలు గడుస్తున్నా చేవెళ్లకు చుక్క నీరు రాలేదు
- బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ రూపకల్పన బాధ్యత పూర్తిగా నాటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని, ఈ విషయంలో మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్‌కు ఎలాంటి ప్రమేయం లేదని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టు డిజైన్‌పై జరిగిన చర్చల్లో హరీశ్ రావు గానీ, ఈటల రాజేందర్ గానీ పాల్గొనలేదని ఆయన తెలిపారు. తాను ఈటల రాజేందర్‌కు మద్దతు ఇవ్వడానికి రాలేదని, కేవలం వాస్తవాలు చెప్పడానికే వచ్చానని కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఈటల రాజేందర్.. కేసీఆర్‌కు అనుకూలంగా మాట్లాడుతున్నారంటూ జరుగుతున్న ప్రచారం నూటికి నూరు శాతం అబద్ధమని ఆయన ఖండించారు. ఈటల ఎప్పుడూ నిజాన్ని నిర్భయంగా చెప్పే వ్యక్తని కొనియాడారు. 'గులాబీ జెండా అందరిది, ఏ ఒక్కరి సొత్తు కాదు' అన్నందుకే ఈటలను బీఆర్ఎస్ పార్టీ నుంచి తరిమేశారని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కేసీఆర్ ఏది చెబితే దానికి తలూపే ఇంజినీర్లు ఉండేవారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఇంత పెద్ద ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపణలు వస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పూర్తిచేసి, నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పారని అన్నారు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా చేవెళ్లకు ఒక్క చుక్క నీరు కూడా రాలేదని ఆయన ఆరోపించారు. మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు.

EDITORIAL సంపాదకీయం

# కాళేశ్వరం.. మూసీ రాజకీయాలు


**కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వరప్రదాయినిగా బిఆర్ఎస్ పార్టీ తాను అధికారంలో ఉన్న పదేళ్ళు ప్రచారం చేసింది. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాజెక్టును ప్రపంచ అద్భుతాల్లో ఒకటిగా పేర్కొన్నారు. కాళేశ్వరం ఫిల్లర్ల కుంగుబాటు నాటినుండీ బిఆర్ఎస్ పార్టీకి కష్టాలు మొదలయ్యాయి. ఇపుడు విచారణ కమిషన్ ముందుకు కేసీఆర్, హరీష్ వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ ముసురుకుకున్న వివాదం తెలంగాణ రాజకీయాల్లో వేడి పుట్టిస్తోంది. కాళేశ్వరం వివాదంతో బీఆర్ఎస్‌ను దెబ్బతీస్తూనే, మూసీ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌లోని పట్టణ ఓటర్లను, పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రయత్నంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. కాళేశ్వరంపై దుష్ప్రచారం జరుగుతోందని బిఆర్ఎస్ వరుస ప్రజంటేషన్ల ద్వారా ప్రజలకు వివరించే ప్రయత్నాలు చేస్తున్నది. అటు కాళేశ్వరం, ఇటు మూసీ చుట్టే తెలంగాణ రాజకీయాలు తిరుగుతున్నాయి.**

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్



కాళేశ్వరం ప్రాజెక్టులలో బాహుబలిగా ప్రచారం చేశారు. బడ్జెట్ తో పాటు నిర్మాణంలోనూ బాహుబలే. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఈ ప్రాజెక్టుకు అత్యధిక సమయం వెచ్చించారు. అయితే ఆయన అధికారంలో ఉండగానే ప్రాజెక్టు కుంగడం పెద్ద శాపంగా మారింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఎన్ని రికార్డులు తిరగరాసిందో ఇపుడు ఆరోపణలు, విచారణల్లోనూ అంతే హాట్ టాపిక్ గా ఉంది. కాళేశ్వరం జల కళ.. కన్నీటితో విల విల కట్టడం మూన్నాళ్లకే కుంగుటేల ఇలా అంటూ వస్తున్న ప్రశ్నలపై ఏడాదిన్నరగా రచ్చ జరుగుతూనే ఉంది. తెలంగాణ అంతటా సస్యశ్యామలం జరగాల్సిన చోట ఒక్క ప్రాజెక్టుకే లక్ష కోట్లు కుమ్మరించి తెలంగాణను ఎడారిగా మార్చాడని రాజకీయ పక్షాల ఆరోపణ. ప్రజలూ దానిని నమ్మడం వల్లే కాళేశ్వరం పరిసర ప్రాంతాల్లో బిఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల్లో కొట్టుకుపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం తెలంగాణ రాజకీయాల్లో కీలక అంశంగా మారింది. ఈ అంశంపై బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు జరుగుతున్నాయి.

ఇక ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం నియమించిన జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ తుదిదశకు చేరుకుంది. ఇప్పటికే మాజీ ఆర్థికమంత్రి, ప్రస్తుత ఎంపీ ఈటల రాజేందర్ విచారణ పూర్తయింది. సోమవారం హరీష్‌రావు, బుధవారం కేసీఆర్ విచారణకు హాజరుకానున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మితమైన అతిపెద్ద ఎత్తిపోతల పథకం, దీనిని తెలంగాణ లైఫ్ లైన్ గా ప్రచారం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నిర్మాణ లోపాలు, అవినీతి ఆరోపణలతో ఈ ప్రాజెక్టు వివాదాస్పదమైంది. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ విచారణ దాదాపు పూర్తి దశకు చేరింది, ఇది ఇపుడు బిఆర్ఎస్ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది.

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వరప్రదాయిని అని బీఆర్ఎస్ చెబుతోంది. రెండు ఫిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్టునే పడావు పెట్టారంటోంది. మరోవైపు కాంగ్రెస్ దీనిని లక్ష కోట్ల అవినీతి దొంగిలించిన "ఏటీఎం"గా పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం వంటి సాంకేతిక లోపాలు బీఆర్ఎస్‌ను రక్షణాత్మక స్థితిలో నిలబెట్టాయి. ఈ విచారణ ఫలితాలు బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తును గణనీయంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ 2024 మార్చిలో ఏర్పాటై, 100 రోజుల్లో నివేదిక సమర్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది, కానీ గడువు ఇప్పటి వరకు పొడిగించబడింది. కమిషన్ ఇప్పటికే 100 మందికి పైగా అధికారులు, నిపుణులను విచారించి, 400 పేజీలకు పైగా నివేదిక సిద్ధం చేసింది. విచారణ పూర్తి దశలో ఉంది, కానీ చర్యలు తీసుకుంటారా.. రాజకీయ రచ్చతోనే వదిలేస్తారా? అన్నది తేలాల్సి ఉంది. బీఆర్ఎస్ నేతలు ఈ విచారణను "రాజకీయ కక్షసాధింపు"గా చిత్రీకరిస్తున్నారు. నివేదికలో ఆధారాలు బలంగా ఉంటే, కేసీఆర్, హరీష్ రావు వంటి నాయకులపై న్యాయపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందా? అన్నదానిపై అనేక చర్చలు.. సందేహాలు ఉన్నాయి.

**కాళేశ్వరం విచారణకు ఈనెల 11న కేసీఆర్ హాజరుకానున్నారు. ఇప్పటికే పూర్తి అఫిడవిట్ ను తయారుచేసినట్లు తెలిసింది. వర్చువల్ గా కేసీఆర్ హాజరయ్యే అవకాశాలున్నాయి. రాజకీయ వ్యూహాలలో కేసీఆర్ దిట్టే అయినా ఇపుడు ఈ రేవంత్ వ్యూహాన్ని ఎలా అధిగమిస్తాడన్నది అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అంశం. కేసీఆర్ విచారణలో సాంకేతిక, ఆర్థిక లోపాలపై బాధ్యత నుంచి తప్పించుకోవడానికి, ఈ ఆరోపణలను కాంగ్రెస్ కుట్రగా చిత్రీకరించేందుకు, ప్రజల్లో సానుభూతి పొందేందుకు వ్యూహరచన చేస్తున్నారు. అయితే కమిషన్ నివేదికలో బలమైన ఆధారాలు బయటపెడితే కేసీఆర్ మరింత బలహీనపడే అవకాశం ఉంది.**

కాళేశ్వరంపై రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లక్ష కోట్ల అవినీతి జరిగిందని, బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర గులాబీ సొమ్మును దోచుకున్నారని ఎన్నికల సమయంలో ఆరోపించారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ "కాళేశ్వరం ఏటీఎం" కాన్సెప్ట్ తో వినూత్న ప్రచారం చేసింది. ఇది వర్కవుట్ కూడా అయింది. ప్రజలు కాంగ్రెస్ ను విశ్వసించారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను "దుష్ప్రచారం"గా, రాజకీయ కక్షసాధింపుగా అభివర్ణిస్తున్నారు. కాళేశ్వరం రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిందని వాదిస్తున్నారు. కాళేశ్వరం పైఈ దుష్ప్రచారం రెండు వైపుల నుంచి రాజకీయ లబ్ధి కోసం జరుగుతోంది. కాంగ్రెస్ ఈ ఆరోపణల ద్వారా బీఆర్ఎస్‌ను రాజకీయంగా బలహీనపరచాలని చూస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ వ్యూహం విజయవంతమైంది. బీఆర్ఎస్ ప్రాజెక్టు విజయాలను హైలైట్ చేస్తూ, కాంగ్రెస్‌ను "రైతు వ్యతిరేక" పార్టీగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. సామాజిక మాధ్యమాల్లో కూడా ఈ ఆరోపణలు తీవ్రంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడ నీళ్ళువచ్చినా అవి కాళేశ్వరం నీళ్ళే అన్నట్లుగా ఒకదశలో బిఆర్ఎస్ శ్రేణులు ప్రచారం చేశాయి. అదే ప్రజల ఆగ్రహానికి కారణమైంది.

కాళేశ్వరం విచారణకు ఈనెల 11న కేసీఆర్ హాజరుకానున్నారు. ఇప్పటికే పూర్తి అఫిడవిట్ ను తయారుచేసినట్లు తెలిసింది. వర్చువల్ గా కేసీఆర్ హాజరయ్యే అవకాశాలున్నాయి. రాజకీయ వ్యూహాలలో కేసీఆర్ దిట్టే అయినా ఇపుడు ఈ రేవంత్ వ్యూహాన్ని ఎలా అధిగమిస్తాడన్నది అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అంశం. కేసీఆర్ వ్యూహం రక్షణాత్మకంగా, రాజకీయంగా ఉంది. విచారణలో సాంకేతిక, ఆర్థిక లోపాలపై బాధ్యత నుంచి తప్పించుకోవడానికి, ఈ ఆరోపణలను కాంగ్రెస్ కుట్రగా చిత్రీకరించేందుకు, ప్రజల్లో సానుభూతి పొందేందుకు వ్యూహరచన చేస్తున్నారు. అయితే కమిషన్ నివేదికలో బలమైన ఆధారాలు బయటపడితే కేసీఆర్ వ్యూహం బలహీనపడే అవకాశం ఉంది.

జూన్ 2025 బిఆర్ఎస్ కు అత్యంత కీలకం. కాళేశ్వరం విచారణ కీలక దశలో ఉంది. కేసీఆర్ జూన్ 11న కమిషన్ ముందు హాజరు కానున్నారు. దీంతో బీఆర్ఎస్‌కు ఒత్తిడి తప్పదు. కాళేశ్వరం విచారణ నివేదిక ఫలితాలు, కేసీఆర్ వాంగ్మూలం రాజకీయంగా ప్రభావం చూపవచ్చు. అంతర్గత కలహాలు, ఫోన్ ట్యాపింగ్ వివాదం వంటి ఇతర సమస్యలు పార్టీని మరింత ఇరకాటంలోకి నెట్టే అవకాశం ఉంది. ప్రభాకర్ రావు భారత్ కు చేరుకుంటున్నారు. ఆయన విచారణకు హాజరైతే సమస్యలు రావొచ్చు. మొత్తంగా కేసీఆర్ కుటుంబాన్ని జూన్ మాసం సమస్యల్లోకి నెట్టే అవకాశం కనపడుతోంది.

బీజేపీలో బండి సంజయ్, ఈటల రాజేందర్, కిషన్ రెడ్డి వంటి నాయకుల మధ్య ఆధిపత్య పోరు ఉంది. బండి సంజయ్‌ను తొలగించి, కిషన్ రెడ్డిని అధ్యక్షుడిగా నియమించినప్పటికీ, అంతర్గత గ్రూపుల మధ్య సమన్వయం లోపించింది. బీజేపీ కేంద్ర నాయకత్వం తెలంగాణలో బలమైన నాయకుడిని ఎంచుకోవడంలో జాగ్రత్తగా వ్యవహరిస్తోంది, ఎందుకంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో 8 సీట్లు గెలిచి బలంగా ఉంది. కాళేశ్వరం వివాదంలో బీజేపీ ఈటల రాజేందర్‌ను కమిషన్ విచారణకు పిలిచిన నేపథ్యంలో, అధ్యక్ష పదవి నిర్ణయం వాయిదా పడుతుందని ఊహాగానాలు ఉన్నాయి. అయితే ఈ ఆలస్యం బీజేపీకి రాజకీయంగా నష్టం కలిగించవచ్చు. ఇక మూసీ పునరుద్ధరణ ద్వారా రియల్ ఎస్టేట్, పర్యాటక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నారు. ఇది హైదరాబాద్‌ను ఆర్థిక కేంద్రంగా మరింత బలోపేతం చేస్తుందని సీఎం భావిస్తున్నారు. కాళేశ్వరం వివాదంతో బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తూనే, మూసీ ప్రాజెక్టు ద్వారా కాంగ్రెస్ సానుకూల ఇమేజ్‌ను నిర్మించాలని రేవంత్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రాజకీయ లబ్ధి చేకూర్చవచ్చు.

సీఎం రేవంత్ రెడ్డి మూసీ పునరుద్ధరణను రాజకీయ, ఆర్థిక వ్యూహంగా ఉపయోగిస్తున్నారు. కాళేశ్వరం వివాదంతో బీఆర్ఎస్‌ను దెబ్బతీస్తూనే, మూసీ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌లోని పట్టణ ఓటర్లను, పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో కాళేశ్వరం, మూసీ చుట్టూ తిరుగుతున్నాయి.

**కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వరప్రదాయినిగా బిఆర్ఎస్ పార్టీ తాను అధికారంలో ఉన్న పదేళ్ళు ప్రచారం చేసింది. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాజెక్టును ప్రపంచ అద్భుతాల్లో ఒకటిగా పేర్కొన్నారు. కాళేశ్వరం ఫిల్లర్ల కుంగుబాటు నాటినుండీ బిఆర్ఎస్ పార్టీకి కష్టాలు మొదలయ్యాయి. ఇపుడు విచారణ కమిషన్ ముందుకు కేసీఆర్, హరీష్ వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ ముసురుకుకున్న వివాదం తెలంగాణ రాజకీయాల్లో వేడి పుట్టిస్తోంది.**

**కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మితమైన అతిపెద్ద ఎత్తిపోతల పథకం, దీనిని తెలంగాణ లైఫ్ లైన్ గా ప్రచారం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నిర్మాణ లోపాలు, అవినీతి ఆరోపణలతో ఈ ప్రాజెక్టు వివాదాస్పదమైంది. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ విచారణ దాదాపు పూర్తి దశకు చేరింది, ఇదే ఇపుడు బిఆర్ఎస్ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది.**

**మూసీ పునరుద్ధరణ ద్వారా రియల్ ఎస్టేట్, పర్యాటక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నారు. ఇది హైదరాబాద్‌ను ఆర్థిక కేంద్రంగా మరింత బలోపేతం చేస్తుందని సీఎం భావిస్తున్నారు. కాళేశ్వరం వివాదంతో బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తూనే, మూసీ ప్రాజెక్టు ద్వారా కాంగ్రెస్ సానుకూల ఇమేజ్‌ను నిర్మించాలని రేవంత్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రాజకీయ లబ్ధి చేకూర్చవచ్చు.**

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:

mahaapatrika@gmail.com

whatsapp-

7436939999

# ఇన్‌స్టాలో బ్లెండ్ అయిపోదాం!

**నలుగురు ఫ్రెండ్స్ ఒక పిట్టగోడపై కూర్చుని కబుర్లు చెప్పుకొనే రోజులు పోయాయి. ఇప్పుడు దోస్తుల ముచ్చట్లు అన్నీ సోషల్ అడ్డాలోనే. ఈ క్రమంలో అన్ని సోషల్ మీడియా వేదికలూ నిత్యం సరికొత్త ఫీచర్స్‌ని పరిచయం చేస్తూ టీన్స్‌ను తమవైపు తిప్పుకొంటున్నాయి. యూజర్లను మరింత ఎంగేజ్ చేయడానికి ఇన్‌స్టా నయా ఫీచర్‌ని తీసుకొచ్చింది. ఇన్‌స్టాలో రీల్స్ స్క్రోల్ చేస్తూ ఒంటరిగా చూస్తూ బోర్‌గా ఫీల్ అవుతున్నారా? మీ ఫ్రెండ్స్‌తో కలిసి ఒక స్పెషల్ రీల్ ఫీడ్ క్రియేట్ చేసుకోవచ్చు. అందరూ కలిసి రీల్స్ చూస్తూ చాట్ చేయొచ్చు. అంతేనా, గ్రూప్‌లో అందరూ కలిసి ఏదైనా కొత్త ట్రెండ్ చేస్తూ దానిపై డిబేట్ చేయొచ్చు. ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన బ్లెండ్ (Blend) ఫీచర్‌తో అంతా సాధ్యమే!**

నేటి జెన్‌జీ యువతకు అభిప్రాయాల్ని పంచుకోవడం నిత్య వ్యవహారంగా మారిపోయింది. అందుకే దోస్తులు ఎవరు ఎక్కడున్నా నిత్యం సోషల్ వేదికలపై యాక్టివ్‌గా ఉంటున్నారు. అందుకే ఇన్‌స్టా ఈ కొత్త ఫీచర్‌ని తీసుకొచ్చింది. దీంతో మీ ఫ్రెండ్స్‌తో, గ్రూప్ చాట్స్‌లో ఒక ప్రైవేట్ రీల్ క్రియేట్ చేసుకోవచ్చు. ఈ ఫీడ్‌లో ఇన్‌స్టాగ్రామ్.. మీకు, మీ ఫ్రెండ్స్‌కు ఇష్టమైన రీల్స్‌ని ఆటోమెటిక్‌గా సెలెక్ట్ చేసి చూపిస్తుంది. అలాగే కొత్త కంటెంట్‌ని మీ ఫ్రెండ్స్‌తో కలిసి డిస్కవర్ చేసే చాన్స్ కూడా ఉంది. కలిసి ఊసులు పంచుకోవచ్చన్నమాట! మీ ఫ్రెండ్స్ ఇష్టాయిష్టాలను, వాళ్లు ఎలాంటి కంటెంట్‌కి ఎలా రియాక్ట్ అవుతున్నారో తెలుసుకోవచ్చు. దీనివల్ల మీ దోస్తానా మరింత బలపడే అవకాశం ఉంది. సింపుల్‌గా చెప్పాలంటే ఒంటరిగా స్వైప్ చేస్తూ.. వేలు నొప్పి తెచ్చుకోకుండా, ఫ్రెండ్స్‌తో కలిసి జోష్‌ఫుల్‌గా నయా కంటెంట్ ఎక్స్‌ప్లోర్ చేయొచ్చన్నమాట! 'బ్లెండ్ ఫీచర్ యూజర్ల మధ్య ఎక్కువ కనెక్షన్ తీసుకొస్తుంది. షేర్ చేసుకునే కంటెంట్ గురించి మాట్లాడుకునే అవకాశం ఇస్తుంది. దీంతో మీ ఫ్రెండ్స్‌తో అప్‌టు డేట్‌గా ఉండొచ్చు' అంటున్నాడు ఇన్‌స్టాగ్రామ్ హెడ్ ఆడమ్ మోసేరి.

**ఫీచర్‌ని ఇలా వాడొచ్చు**

Instagram Blend ఫీచర్‌ని ఉపయోగించడం చాలా సులభం. ఈ ఫీచర్ బీటా వెర్షన్లో ఎప్పటినుంచో ఉన్నదే! ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చింది. ముందుగా ఇన్‌స్టాగ్రామ్ యాప్‌ని ఓపెన్ చేయాలి. అందులో మీ ఫ్రెండ్‌తో గానీ, గ్రూప్‌తో గానీ ఉన్న DM (డైరెక్ట్ మెసేజ్)కి వెళ్లాలి. అక్కడ చాట్‌లో పైన కుడివైపు Blend అనే ఐకాన్ కనిపిస్తుంది. దాన్ని ట్యాప్ చేయాలి. తర్వాత 'Invite' అనే ఆప్షన్ కనిపిస్తుంది దాన్ని ట్యాప్ చేసి మీ ఫ్రెండ్స్‌ని ఇన్వైట్ చేయొచ్చు. వాళ్లు మీ ఇన్విటేషన్‌ను యాక్సెప్ట్ చేస్తే... మీకు, మీ దోస్తులకు ఇష్టమైన రీల్స్ సెలెక్ట్ చేసి ఒక ప్రైవేట్ ఫీడ్ క్రియేట్ అవుతుంది. ఇప్పుడు ఆ ఫీడ్‌లో స్క్రోల్ చేస్తూ రీల్స్ చూడొచ్చు! మీ ఫ్రెండ్స్‌తో రియాక్ట్ అవ్వొచ్చు. రిప్లై బార్ ఉపయోగించి చాట్ చేయొచ్చు. ఈ బ్లెండ్ ఫీడ్ రోజూ కొత్త రీల్స్ అప్‌డేట్ చేస్తుంది. దీంతో రోజూ కొత్త కంటెంట్ చూస్తూ ఎంజాయ్ చేయొచ్చు! Blend ఫీచర్‌ని ఉపయోగించి ఇన్‌స్టాగ్రామ్ ఎక్స్‌పీరియన్స్‌ని మరింత ఫన్‌గా, సోషల్‌గా మార్చేసుకోండి.



## నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సాయం

- కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్
- ఐదు కుటుంబాలకు 50వేల రూపాయలు అందజేత
- స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు



**రంగారెడ్డి జిల్లా మహా:** మాల్ గ్రామంలో నిరుపేద దళిత కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు, యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ముదిరాజ్, 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం లోని, మాల్ గ్రామానికి చెందిన గుడుగుంట్ల సునీత రమేష్, నిర్మల కుమార్, పద్మా రాములు, వస్కుల అండాలు రాములు, ముదిగొండ మంజుల రామచంద్రి కుటుంబాలకు చెందిన వారి ఆడబిడ్డల వివాహాలకు పదివేల చొప్పున 50వేల రూపాయల ఆర్థిక సాయం బట్టు శ్రీనివాస్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నిరుపేదలైన ఆడబిడ్డల వివాహాలకు పెళ్ళికానుక అందించడం జరిగిందని, ఈ ఆర్థిక సాయం చేయడం తనకి ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు. మాల్ గ్రామంలో ఎవరికి ఆపద వచ్చిన తాను ముందుంటానని, ప్రతి ఒక్కరికి అండగా ఉంటూ తమ వంతు కృషి తప్పకుండా చేస్తానని ఆయన అభిప్రాయాన్ని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందని, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా, తన వంతు బాధ్యతగా పనిచేస్తాన ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నోళ్ల పద్మజ జహంగీర్ మాజీ వార్డు సభ్యులు గొల్లపల్లి వెంకటేష్, చిన్నోళ్ల వెంకటయ్య విహెచ్ పిసి అధ్యక్షులు దేరంగుల ఈశ్వర్ నాయకులు కప్పాటి యాదయ్య గుడుగుంట్ల రాములు గుడుగుంట్ల కృష్ణ, గుడుగుంట్ల కుమార్, చిన్నోళ్ల బుచ్చయ్య, కలకొండ పర్వతాలు, కంబాలపల్లి సాయిలు, జాపాల రాములు, ఎర్రం సోమయ్య, జాపాల కృష్ణయ్య, కొప్పుల వెంకటేష్, మిద్దె పెద్ద జంగయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఎస్ ఆర్ యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ విజయాలు

- 1200 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక
- రూ.51 లక్షల వార్షిక ప్యాకేజీతో అత్యధిక జీతం
- విద్యార్థులకు అభినంద పత్రాలు, ఆఫర్ లెటర్లు అందజేసిన చాన్సలర్




**వరంగల్, మహా ;** విద్యార్థులు సాధించిన ఉద్యోగ విజయాలను పురస్కరించు కుంటూ ఎస్ ఆర్ యూనివర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం గ్రాండ్ ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విశ్వవిద్యాలయం పరిశ్రమలతో ఉన్న బలమైన అనుసంధానాన్ని, విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన శిక్షణ, కెరీర్ అభివృద్ధి పై ఉన్న నిబద్ధతను ప్రతిబింబించింది. ఈ సందర్భంగా చాన్స్‌లర్ ఏ వరద రెడ్డి మాట్లాడుతూ, ఈ విజయాలు పరిశ్రమ అవసరాలను గుర్తించి, విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించిన ఫలితంగానే సాధ్యమయ్యాయని వారి నమ్మకాన్ని ప్రోత్సహిస్తూ అన్ని కోణాల్లో వారిని అభివృద్ధి చేయడమే మా లక్ష్యమని పేర్కొన్నారు. ఈ విజయాల్లో కీలకంగా పనిచేసిన డీన్లు, శాఖాధిపతులు, డైరెక్టర్లు, ప్లేస్‌మెంట్ సమన్వయకర్తలు వీరందరి కృషిని ఈ వేదిక ద్వారా ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. అనంతరం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ, ప్లేస్‌మెంట్ విజయాలతో పాటు, విద్యార్థులకు ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించేందుకు అనేక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో మేము ఎమ్ ఓ యు లు కుదుర్చుకున్నామని అలాగే మా ఎస్ ఆర్ ఐ ఎస్ ఇంక్యుబేషన్ కేంద్రం ద్వారా విద్యార్థుల స్టార్టప్ ఆలోచనలకు సీడ్ ఫండింగ్ ద్వారా మద్దతు అందిస్తున్నాం. ఈ దిశగా కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేట్ డైరెక్టర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ జి. సునీల్ రెడ్డి ఈ విద్యా సంవత్సరానికి గల ప్లేస్‌మెంట్ నివేదిక ను సమర్పించారు. ఈ సంవత్సరం 1200 మందికి పైగా విద్యార్థులు వివిధ ప్రఖ్యాతి గాంచిన సంస్థలలో ఉద్యోగాలకు ఎంపిక కావడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని అన్నారు. ఈ ఏడాది ఎస్ ఆర్ యూనివర్సిటీ క్యాంపస్ ను సందర్శించిన సంస్థలలో మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్, సర్వీస్‌నౌ, పేపాల్, ఫ్లిప్‌కార్ట్ నీవ్, ష్నైడర్ ఎలక్ట్రిక్, ఇన్ఫోసిస్, కాప్జెమిని, యాక్సెంచర్, కాగ్నిజెంట్, హ్యుండాయ్, బోష్, తోషిబా, టెక్ మహీంద్రా వంటి ప్రఖ్యాత మల్టీనేషనల్ సంస్థలు కూడా ఉన్నాయని ఈ సంవత్సరం విద్యార్థులు అందుకున్న అత్యధిక జీత ప్యాకేజీలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వార్షికంగా 51 లక్షలు, 44 లక్షలు, 34.4 లక్షల జీత ఆఫర్లు లభించడం విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలను కల్పించడం పై ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా నిలిచిందని చెప్పవచ్చు. తదనంతరం యూనివర్సిటీ చాన్స్‌లర్ వరద రెడ్డి, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. అర్చనా రెడ్డి తో కలిసి ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థులకు అభినందన పత్రాలు ఆఫర్ లెటర్లు అందజేశారు. వారు విద్యార్థుల ప్రతిభ, శ్రమ సాధనను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వి మహేష్, వివిధ స్కూళ్ల డీన్లు, శాఖాధిపతులు, ఉపాధ్యాయులు, ప్లేస్‌మెంట్ టీమ్, ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బక్రీద్ త్యాగానికి, విశ్వాసానికి, అల్లాహ్‌కి విధేయతకు ప్రతీక

- మైనారిటీల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం
- పెద్దమ్మ గడ్డ ఈద్గా ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, చైర్మన్ సిరిసిల్ల రాజయ్య





**హన్మకొండ మహా ;** బక్రీద్ పండుగ త్యాగానికి, విశ్వాసానికి, అల్లాహ్‌కి విధేయతకు ప్రతీక అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం బక్రీద్ పండుగను పురస్కరించుకొని హనుమకొండ లోని పెద్దమ్మగడ్డలోని ఈద్గా లో ప్రత్యేక ప్రార్థనలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య తో కలిసి పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. ముస్లింలందరికీ హృదయపూర్వక బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతూ ఈ పవిత్రమైన పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదర, సోదరీమణులకు సమాజంలోని ప్రతి ఒక్కరికి శాంతి, ఆనందం, ఐక్యత కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు. బక్రీద్ అనేది త్యాగానికి, విశ్వాసానికి, అల్లాహ్‌కి విధేయతకు ప్రతీక. ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) చేసిన త్యాగం మనందరికి నిస్వార్థత, ధైర్యం, భక్తి అనే విలువల్ని గుర్తు చేస్తుంది. ఈ పండుగ సారాంశం మనం పంచుకునే ప్రేమలో, సహనంలో, మానవత్వంలో ఉంటుంది. ఇవాళ మన తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోంది. ఆయన దృష్టిలో ప్రతి మతస్తుడూ సమానంగా గౌరవించబడతాడు. మైనారిటీల కోసం విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాల్లో అనేక పథకాలు తీసుకొచ్చారు. ముస్లిం సోదరులకు కావలసిన మౌలిక వసతులు, మసీదుల అభివృద్ధి, గురుకుల పాఠశాలలు, మైనారిటీ కార్పొరేషన్ అభివృద్ధికి ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ పవిత్రమైన బక్రీద్ పండుగ మన రాష్ట్రానికి శాంతిని, ఐక్యతను, అభివృద్ధిని తీసుకురావాలని, ప్రతి ఇంటిలో ఆనందాన్ని నింపాలని కోరుకుంటూ అందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబేద్కర్ రాజు, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, స్థానిక నాయకులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ త్యాగానికి, విశ్వాసానికి ప్రతీక : కొండా మురళి



**వరంగల్, మహా;** బక్రీద్ పండుగ పురస్కరించుకొని శనివారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్ బాబా నివాసంలో ఆతిథ్యాన్ని స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్ బాబా, వారి తండ్రి నవీద్ బాబా, ఇతర కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బక్రీద్ ప్రత్యేక వంటకమైన షీర్ ఖుర్మాను కొండా మురళీధర్ రావు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాల్ నవీన్ రాజ్, సయ్యద్ వసీం, కోడం శివకృష్ణ, అమీర్ చోటు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్, ముఖ్య నాయకులు, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## గైనేని స్వరూప భౌతికకాయానికి నివాళులర్పించిన డాక్టర్ కాళీ ప్రసాద్



**హన్మకొండ మహా ;** హన్మకొండ జిల్లా లోని హంటర్ రోడ్డు లో గల రాజ్ హోటల్ వ్యవస్థాపకులు గైనేని రాజన్ సతీమణి గైనేని స్వరూప శనివారం మృతి చెందగా వారి భౌతికకాయానికి బిజెపి రాష్ట్ర నాయకులు, పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి హన్మకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ అమరేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కూతురు రాజు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన బొల్లం రమేష్




**వరంగల్ మహా;** వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా బొల్లం రమేష్ ను నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయగా శనివారం ఆయన వరంగల్ ఏసిపి నంది రామ్ నాయక్ ను మర్యాద పూర్వక కలిసిన అనంతరం మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు.

## తులసి ముకేష్ ముదిరాజ్ ఆధ్వర్యం లో మండల కార్యశాల కార్యక్రమం

**బాలాపూర్, మహా:** ప్రధాని మోదీ నాయకత్వం లో బీజెపి ప్రభుత్వం 11 సంవత్సరాలలో అమలు చేసిన పథకాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి బీజెపి కార్యకర్త పై ఉందని రూలర్ బీజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పతంగి రాజ్ భూపాల్ గౌడ్ సూచనలు మేరకు 30 రోజుల కార్యచరణ గురించి చర్చించడానికి మీర్ పేట్ కార్పొరేషన్2 అధ్యక్షులు తులసి ముకేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మండల కార్యశాల కార్యక్రమం నిర్వహించినట్టు ముఖేష్ ముదిరాజ్ తెలిపారు. వికసిత్ భారత్, అమృత,సుపరిపాలన,పేదల సంక్షేమానికి కోసం బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ముఖేష్ ముదిరాజ్ తెలిపారు. అట్టడుగు వర్గాల ప్రజల అభివృద్ధి,సంక్షేమం తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్ రెడ్డి,జిల్లా కౌన్సిల్ మెంబర్ సోమేశ్వర,జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్ రెడ్డి,సీనియర్ నాయకులు సత్తయ్య,కాసిరెడ్డి వేంకటేశ్వర రెడ్డి,కాశీరాం,జగన్ ముదిరాజ్,గోపీనాథ్,అమరేందర్ రెడ్డి,రమేష్ ముదిరాజ్, వేణుగోపాల్ రెడ్డి,దామోదర్ రెడ్డి, సుధాకర్ నేత, మల్లేష్,రంగా రెడ్డి, మల్లికార్జున్, సిద్దాల శ్రీనివాస్, సుభాష్ గౌడ్,రాజు చారి,శ్రీనివాస్ నాయక్,రవీంద్ర, సురేష్,ఆనంద్,నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి విశ్వాసాలకు బక్రీద్ పండుగ ప్రతీక

- ఫరూక్ నగర్ ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- హాజరైన షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, జమ్రుద్ ఖాన్ తదితరులు



**షాద్ నగర్, మహా :** ఈద్ ఉల్అధా (బక్రీద్) పర్వదినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులకు షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఫరూక్ నగర్ ఈద్గా వద్ద బక్రీద్ పర్వదినం సందర్భంగా నిర్వహించిన ఈదుల్ అదా నమాజ్ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యారు. మున్సిపల్ శాఖ ఏర్పాటు చేసిన శుభాకాంక్షలు వేదిక వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఏసిపి లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీఐ విజయ్ కుమార్, పట్టణ మాజీ కౌన్సిలర్ సర్వర్ పాషా, జమృత్ ఖాన్ తదితరులు ముస్లిం సోదరులకు అలైబలై తీసుకుంటూ శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఈద్గా వద్ద మీడియాతో మాట్లాడుతూ.. త్యాగానికి, సహనానికి, భక్తి విశ్వాసాలకు బక్రీద్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. శాంతి, కరుణ, సహనం, సామరస్యం, ఐకమత్యం, సోదరభావం స్ఫూర్తితో ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా భాగస్వామ్యం, దానధర్మం, గౌరవం, అవసరమైన వారికి సాయం చేయడం బక్రీద్ పండుగ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. దేవుడిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని సందేశాన్ని బక్రీద్ ఇస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.

# ఆత్మగౌరవంతో పేదోడు సొంతింట్లో బతకాలి

- ప్రజాపాలనలో పేదోడి సొంతింటి కల నెరవేరుతుంది
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి
- ఆరుట్లలో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసి భూమిపూజ



**రంగారెడ్డి జిల్లా మహా:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలోనే పేదల సొంతింటి కల నెరవేరుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మంజూరైన నూతన ఇండ్లకు ముగ్గులు పోసి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో గ్రామంలో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ళు వచ్చేలా చూస్తామని, పేదోడు సొంతింట్లో ఆత్మ గౌరవంతో బతకాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరుస్తూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, మాజీ సర్పంచులు సుంకరి పాండరీనాథ్, అనంగల్ల యాదయ్య, మాజీ ఎంపిటిసిలు నూకం సత్తయ్య, లాలగారి శ్రీకాంత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నర్సింహా, బుట్టి కృష్ణ, కంబాలపల్లి బుగ్గరాములు, మార బౌరమ్మ, లక్ష్మణ్, కోరే యాదమ్మ, బాబు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు రావుల భాషయ్య, దాసరమోని రమేష్, గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేష్, మంచాల మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఎండి బురాన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్ అదుపుతప్పి గురునానక్ విద్యార్థి మృతి



**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని, గురునానక్ కాలేజీలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న ఋతికేష్ అనే విద్యార్థి ప్రమాదానికి గురై మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే నిన్న గురునానక్ కాలేజీలో శుక్రవారం ఫేర్వెల్ పార్టీ నిర్వహించడం జరిగింది జరిగింది. ఫేర్వెల్ పార్టీ అనంతరం తన క్లాస్మేట్ మంగళపల్లి ప్రైవేట్ హాస్టల్లో ఉంటున్న సంజయ్ దగ్గరికి వెళ్లి, హాస్టల్లో పార్టీ చేసుకుని అర్ధరాత్రి సమయంలో ఇబ్రహీంపట్నం తిరుగు ప్రయాణంగా ఋతికేష్, శంకర్ ఒకే మోటార్ సైకిల్ మీద బయలుదేరి వస్తున్న సందర్భంలో శేరిగూడలోని గాంధీ విగ్రహం వద్దకు రాగానే మోటార్ సైకిల్ అదుపుతప్పి ప్రమాదానికి గురి కావడంతో అక్కడికక్కడే ఋతుకేష్ మృతి చెందగా, తీవ్ర గాయాల పాలైన శంకరును నగరంలోని నిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు ఋతికేష్ మంచిర్యాల జిల్లా, మంచిర్యాలకు చెందిన వ్యక్తిగా పోలీసులు తెలిపారు.

## శంషాబాద్ ఈద్గాలో ప్రార్థనలు

**రాజేంద్రనగర్ మహ ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో బక్రీద్ సందర్భంగా శంషాబాద్ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సోదరులు. రంజాన్ మాసం ముగింపును సూచించే ఈద్ అల్‌ఫితర్ తర్వాత ఇది రెండవ అతిపెద్ద ఇస్లామిక్ పండుగ. ఇస్లామిక్ క్యాలెండర్ చంద్ర చక్రాలపై ఆధారపడి ఉంటుంది. గ్రెగోరియన్ క్యాలెండర్ కంటే సుమారు 11 రోజులు తక్కువగా ఉంటుంది. అందుకే ఈద్ అల్‌అధా తేదీ ప్రతి సంవత్సరం మారుతుంది.రంజాన్ మాసం ముగింపును సూచించే ఈద్ అల్‌ఫితర్ తర్వాత ఇది రెండవ అతిపెద్ద ఇస్లామిక్ పండుగ. ఇస్లామిక్ క్యాలెండర్ చంద్ర చక్రాలపై ఆధారపడి ఉంటుంది. గ్రెగోరియన్ క్యాలెండర్ కంటే సుమారు 11 రోజులు తక్కువగా ఉంటుంది. అందుకే ఈద్ అల్‌అధా తేదీ ప్రతి సంవత్సరం మారుతుంది.

## గీతా భవన్ లో శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు



**వరంగల్ మహా ;** వైష్ణవానాం ఏకాదశి సందర్భంగా శనివారం వరంగల్ నగరంలోని ప్రముఖ ప్రాచీన ప్రసిద్ధి గాంచిన మందిరమైన గీతాభవనంలో కొలువై ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి వారికి నవకలశ ఆరాధన తో పాటు పంచామృతాలు, తులసి మాలలు, ప్రత్యేకించి మామిడి పండ్ల రసాలతో, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అత్యంత విశేషంగా జరిగినటువంటి అభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా అర్చకులు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## వరంగల్ కమిషనర్ లో భారీగా ఎస్ఐల బదిలీలు

**వరంగల్ మహా ;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్ల లో విధులు నిర్వహిస్తున్న 15 మంది ఎస్.ఐలను బదిలీ చేస్తూ శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.


## ఏటా రూ.20 లక్షలు సంపాదన..
# ఇల్లు కొనలేని స్థితి



ఏడాదికి రూ.20 లక్షలు సంపాదించే ఓ వ్యక్తి ఇప్పటికీ అపార్ట్‌మెంట్ కొనలేని స్థితిలో ఉన్నాడని చేసిన పోస్ట్ దేశంలోని వివిధ నగరాల్లో రియల్ ఎస్టేట్ ధరలపై చర్చకు దారితీసింది. నెలకు అన్ని ఖర్చులు పోను రూ.1.2 లక్షలు మిగులుతున్నా తన మిత్రుడు తాను ఉంటున్న నగరంలో ఒక ఇంటిని కొనలేని పరిస్థితిలో ఉన్నాడని ఒక వక్తి చేసిన పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఎక్స్ (గతంలో ట్విటర్) వేదికగా అఖిలేశ్ అనే వ్యక్తి పోస్ట్ చేస్తూ..'గుర్‌గావ్‌లోని నా స్నేహితుడు ఏటా రూ.20 లక్షల సీటీసీ వేతనంతో ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. పన్నులు, ఈపీఎఫ్, మినహాయింపులు తర్వాత నెలకు రూ.1.2 లక్షలు మిగులు ఉంటుంది. తాను వస్తువుల కొనుగోళ్లలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోడు. కారు లేదు. పిల్లలు లేరు. తాను, తన భార్య మాత్రమే ఉంటున్నారు. ఇల్లు కొందామని ప్రయత్నిస్తున్నాడు. కానీ తాను వెళ్తున్న ప్రతి ప్రాజెక్టులో అపార్ట్‌మెంట్ విలువ రూ.2.5 కోట్లతో ప్రారంభమవుతుంది. ఇన్ఫినిటీ పూల్స్, జెన్ గార్డెన్స్, ఇటాలియన్ మార్బుల్, బయోమెట్రిక్ లిఫ్టుల గురించి బ్రోచర్లలో ఊదరగొడుతున్నారు. దీన్ని కొనుగోలు చేస్తే కేవలం జీతం కోసం బతకాల్సి ఉంటుంది. బఫర్ మనీ ఉండదు. సెలవులు ఉండవు. ఎమర్జెన్సీ ఉండదు' అని పేర్కొన్నారు. 'నా స్నేహితుడు దేశంలో చాలామంది ఉద్యోగులు సంపాదించే దానికంటే కొంత మెరుగ్గానే సంపాదిస్తున్నాడు. కానీ ఇప్పటికీ తాను నివసిస్తున్న నగరంలో ఇల్లు కొనలేని పరిస్థితులు ఉన్నాయి. రియల్టీ మార్కెట్ వేరే వారికోసం సరిగ్గా డిజైన్ చేసిన విధంగానే పనిచేస్తోంది' అని తెలిపారు. దీనిపై నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. 'రియల్టీ వ్యాపారం పెరుగుతోందా..? జీతాలు తగ్గుతున్నాయో అర్థం కావడం లేదు' అని ఒకరు రిప్లై ఇచ్చారు. గుర్‌గావ్ పెట్టుబడిదారులకు ఆకర్షణీయంగా ఉందని మరొకరు వ్యాఖ్యానించారు.

## విమాన సిబ్బంది తీరుపై అసహనం

ఎయిర్‌పోర్ట్‌లో విమాన ప్రయాణ సంస్థ సిబ్బంది సరిగా వ్యవహరించకపోవడంతో దాదాపు రూ.2.65 లక్షల విలువైన క్లయింట్ డీల్‌ను కోల్పోయినట్లు లింక్డ్‌ఇన్‌లో ఓ ప్రయాణికుడు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన జైపూర్ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. పోస్ట్‌లోని వివరాల ప్రకారం.. ఇండిగో సిబ్బంది సరిగా వ్యవహరించకపోవడం వల్ల తాను ప్రయాణించాలనుకున్న విమానాన్ని మిస్సయ్యానని ఓ వ్యక్తి తెలిపారు. చయాన్ గార్గ్ అనే ప్రయాణికుడు 'ఇండిగో, మీరు దిగజారుతున్నారు' అనే శీర్షికతో ఓ పోస్ట్ చేశారు. 'నేను జైపూర్ నుంచి ముంబయి వెళ్లాలనుకున్నాను. దాంతో తెల్లవారుజామున 4:40 గంటలకు జైపూర్ విమానాశ్రయానికి చేరుకున్నాను. 5:10 గంటలకు సెక్యూరిటీ క్లియర్ చేశాను. 1015 నిమిషాల్లో బోర్డింగ్ ప్రారంభమవుతుందని ఇండిగో ఎగ్జిక్యూటివ్ చెప్పారు. బోర్డింగ్ గేటు రద్దీగా ఉండటాన్ని గమనించి బోర్డింగ్ ప్రారంభానికి ముందు వాష్ రూమ్ వెళ్లాలని నిర్ణయించుకున్నాను. నేను 12 నిమిషాల్లో తిరిగి వచ్చాను. అంతలోనే బోర్డింగ్ మూసివేశారు. ఆ సమయానికి బోర్డింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా, మూసివేతపై ఆశ్చర్యపోయాను. గేటు మూసివేస్తున్నారని ఎలాంటి ప్రకటనలు చేయలేదు' అని చెప్పారు. ఎయిర్‌పోర్ట్ సిబ్బందిని ప్రశ్నించగా జైపూర్ విమానాశ్రయంలో బహిరంగ ప్రకటన అవకాశాలు పరిమితంగా ఉన్నాయని తెలియజేసినట్లు గార్గ్ చెప్పారు. ఫ్లైట్ సిబ్బందిని వేడుకున్నప్పటికీ, తాను వెళ్లాల్సిన క్లయింట్ సమావేశం ఎంత అత్యవసరమో వివరించినప్పటికీ బోర్డింగ్ క్లియర్ చేయలేదని తెలిపారు. ప్రయాణానికి ప్రత్యామ్నాయం చూపలేదని చెప్పారు. టికెట్ ఫేర్ రీఫండ్ ఇవ్వలేదన్నారు. కనీసం సిబ్బంది తనపై సానుభూతి చూపలేదని వాపోయారు.



## యాపిల్ కొత్త ఓఎస్ గురించి తెలుసా..?

ప్రపంచ టెక్ దిగ్గజం యాపిల్ డబ్ల్యూడబ్ల్యూడీసీ 2025లో 'హోమ్‌ఓఎస్' పేరుతో సరికొత్త స్మార్ట్ హోమ్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించనున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఐఫోన్ కోసం ఐఓఎస్, యాపిల్ వాచ్ కోసం వాచ్‌ఓఎస్, ఐప్యాడ్ కోసం ఐప్యాడ్‌ఓఎస్ వంటి ఎకోసిస్టమ్ పరికరాలకు ప్రత్యేకంగా యాపిల్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను రూపొందించింది. ఇదే తరహాలో ఈ కొత్త ఆపరేటింగ్ సిస్టం యాపిల్ స్మార్ట్ హోమ్ డివైజ్‌లకు ఉపయోగకరంగా మారనుందని చెబుతున్నారు.

**హోమ్‌ఓఎస్‌లోని ఫీచర్లు ఇలా..**

కస్టమైజబుల్ హోమ్ స్క్రీన్: ఐఓఎస్ మాదిరిగానే వినియోగదారులు వాతావరణం, స్టాక్స్, రిమైండర్లు.. వంటివాటి కోసం విడ్జెట్లను జోడించవచ్చు. స్మార్ట్ హోమ్ కంట్రోల్స్: హోమ్ యాప్ ద్వారా లైట్లు, సెక్యూరిటీ, క్లైమేట్ ఇతర యాక్సరీలను సులభంగా నిర్వహించవచ్చు.

సిరి, యాపిల్ ఇంటెలిజెన్స్: సందర్భానికి తగినట్లు లోతైన అవగాహనతో మెరుగైన వాయిస్ కంట్రోల్‌తో చర్యలు తీసుకోవడానికి సిరిని అనుమతిస్తుంది.

హోమ్ ఆటోమేషన్: నిద్రపోతున్న సమయంలో తలుపులకు తాళం వేయడం, సాయంత్రం అయితే లైట్లు ఆన్ చేయడం లేదా ఇంట్లోకి వచ్చే ముందు మీ ఇంట్లోని ఏసీ, వాషింగ్ మిషన్.. ఇతరత్రా ఎలక్ట్రానిక్ వస్తువులను రిమోట్‌గా నిర్వహించడం.

డైనమిక్ రెస్పాన్సిబిలిటీ: సిస్టమ్ యూజర్ ప్రాక్సిమిటీ ఆధారంగా పని చేసేలా ఏర్పాటు చేస్తున్నారు. అంటే ఇంటికి దూరంగా ఉన్నప్పుడు విడ్జెట్‌లు లేదా ఫొటోలను ప్రదర్శించడం ద్వారా వాటిని రిమోట్‌గానే నిర్వహించవచ్చు. సమీపంలో ఉన్నప్పుడు హోమ్ స్క్రీన్‌ను ఉపయోగించవచ్చు.




## ఒకటో తేదీ వచ్చిందంటే వణుకు

ఉద్యోగులు ప్రస్తుతం తాము చేస్తున్న కంపెనీ పని వాతావరణం నచ్చకో.. మరింత వేతనం ఆశించో.. ప్రమోషన్ కోసమో.. ఇలా విభిన్న కారణాలతో వేరే సంస్థకు మారాలనుకుంటున్నారు. అయితే ప్రస్తుతం తాము పని చేస్తున్న కంపెనీ వేతనం ఇచ్చిన తేదీ రోజున లేదంటే తర్వాత రోజున ఉద్యోగులు అధికంగా రాజీనామా పత్రాలను సమర్పిస్తున్నట్లు టెక్ నిపుణులు చెబుతున్నారు. ఈ తంతు యువకుల్లో మరీ ఎక్కువగా ఉంటోందంటున్నారు. ముంబయికి చెందిన స్టార్టప్ 'పిట్ @గో జీరో' వ్యవస్థాపకురాలు కిరణ్ షా ఈ మేరకు వివరాలు వెల్లడించారు. 'ఉద్యోగులకు తాము చేస్తున్న కంపెనీలు నచ్చలేదంటే.. సరిగ్గా వేతనం పడే రోజున లేదా పడిన మరుసటి రోజున రాజీనామా చేస్తున్నారు. ఇది కొన్ని యాజమాన్యాలకు ఆందోళన కలిగిస్తుంది. ఈ తంతు యువకుల్లో మరీ ఎక్కువగా కనిపిస్తోంది. సాధారణంగా అన్ని కంపెనీల్లో ఒకటో తేదీన జీతాలు ఇస్తారు. కాబట్టి ప్రతి నెల ఒకటో తేదీ వచ్చిందంటే కొన్ని యాజమాన్యాలకు చుక్కలే. తమ ఉద్యోగులు ఎక్కడ రాజీనామా పత్రాలతో సిద్ధంగా ఉంటారోననే ఆందోళన చెందుతుంటాయి. ఉద్యోగులు కూడా ఈ విషయంలో కంపెనీలకు విధేయతతో ఉండాలి. తమ డిమాండ్లు ఏమిటో ముందుగా కంపెనీతో చర్చించాలి' అన్నారు. 'ఉద్యోగులు నిజంగా కంపెనీ నుంచి తప్పుకోవాలనుకుంటే హుందాగా తప్పుకోండి. తప్పా కంపెనీ వేతనం పడిన వెంటనే కొలువు నుంచి వైదొలగడం సరికాదు. అప్పటివరకు ఉద్యోగికి ఇచ్చిన బాధ్యతలు వెంటనే మరో వ్యక్తికి అసైన్ చేయాలంటే సంస్థకు ఇబ్బందులు వస్తాయి. కాబట్టి తప్పకుండా నోటీస్ పీరియడ్ చేయాలి. జీతం వేసిన వెంటనే మీ యజమానిని భయభ్రాంతులకు గురిచేయకండి' అని తెలిపారు.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL


## 400 డ్రోన్లు, 40 క్షిపణులతో ఉక్రెయిన్‌పై
# విరుచుకుపడిన రష్యా

**కీవ్:** ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడికి దిగింది. ఏకంగా 400 డ్రోన్లు, 40 క్షిపణులను ప్రయోగించి, అతిపెద్ద దాడికి పాల్పడింది. ఈ దాడి దేశమంతటినీ ప్రభావితం చేసిందని, లెక్కలేనంత మంది గాయపడ్డారని, వందలాదిమంది శిథిలాల కింద చిక్కుకున్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రకటించారు. రష్యాకు చెందిన వ్యూహాత్మక క్రూయిజ్ క్షిపణి వాహక నౌకలను లక్ష్యంగా చేసుకుని, ఉక్రెయిన్ 'ఆపరేషన్ స్పైడర్‌వెబ్'ను నిర్వహించిన దరిమిలా, రష్యా తాజాగా ఉక్రెయిన్‌పై భీకరదాడి చేసింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సోషల్ మీడియా ప్లాట్‌ఫారం 'ఎక్స్'లో 'ఈరోజు, మన దేశంలోని వివిధ ప్రాంతాలు, నగరాల్లో రెస్క్యూ ఆపరేషన్‌తో పాటు అత్యవసర కార్యకలాపాలు రోజంతా కొనసాగాయి.

రష్యన్లు 400కు మించిన డ్రోన్లు, 40కిపైగా క్షిపణులను ప్రయోగించారు. ఈ దాడుల్లో 80 మంది గాయపడ్డారు. కొందరు ఇప్పటికీ శిథిలాల కింద విలవిలలాడుతున్నారు. ప్రపంచంలోని కొందరు ఇటువంటి దాడులను ఖండించరు. పుతిన్ ఈ కోవకు చెందిన వ్యక్తి. యుద్ధం కొనసాగిస్తూనే ఉన్నారు' అని పేర్కొన్నారు. ఉక్రెయిన్ రాజధాని కైవ్‌లో ఈ దాడి కారణంగా ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది మృతిచెందారు. లుట్‌స్క్‌లో ఇద్దరు పౌరులు, చెర్నిహివ్‌లో మరొక వ్యక్తి మృతిచెందారు. మొత్తం ఆరుగురు మరణించారని, పలువురు గాయపడ్డారని ఉక్రేనియన్ స్టేట్ ఎమర్జెన్సీ సర్వీస్ (సీఎన్ఎన్) మీడియాకు తెలిపింది. రష్యా జరిపిన ఈ సైనిక దాడి ఇరు దేశాల మధ్య మూడేళ్లుగా కొనసాగుతున్న దాడులలో అతిపెద్ద దాడి. కైవ్ ఉగ్రవాద చర్యలకు ప్రతిగా ఈ దాడులు చేపట్టినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.



## ట్రంప్‌తో ఫైటింగ్.. మస్క్‌కు రష్యా బంపరాఫర్



**మాస్కో:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ల మధ్య విభేదాలు కొనసాగుతున్న వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఎలాన్ మస్క్‌ను రష్యా బంపర్ ఆఫర్ ఇచ్చింది. మస్క్ తమ దేశానికి రావాలని.. రాజకీయ శరణార్థిగా ఉండేందుకు మస్క్‌కు అవకాశం కల్పిస్తామని రష్యా తెలిపింది. ఈ మేరకు దిమిత్రి నోవికోవ్ చెప్పుకొచ్చారు. డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ మధ్య స్నేహ బంధం బీటలు వారింది. ఈ నేపథ్యంలో మస్క్‌ను మచ్చిక చేసుకునేందుకు రష్యా రంగంలోకి దిగింది. తాజాగా రష్యాకు చెందిన స్టేట్ డూమా ఫెడరేషన్ కమిటీ ఛైర్మన్ దిమిత్రి నోవికోవ్ ఓ కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతూ.. ఎలాన్ మస్క్ భిన్నమైన వ్యక్తి. ఆయన ఆలోచనా విధానం వేరుగా ఉంటుంది. మస్క్ పూర్తిగా భిన్నమైన ఆట ఆడతారని నేను అనుకుంటున్నా. ఆయనకు రాజకీయ శరణార్థిగా ఉండాల్సిన అవసరం లేదు. ఒకవేళ ఆయన అలా చేయాలనుకుంటే రష్యా సహకరిస్తోంది. అమెరికాకు చెందిన ఎడ్వర్డ్ స్నోడెన్ లాగానే మస్క్‌కు కూడా రష్యాలో ఉండేందుకు అవకాశం కల్పిస్తాం అని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో అమెరికాలో తర్వాత జరిగే ఎన్నికల్లో డెమోక్రట్లు రావాలని మస్క్ కోరుకోవడం లేదని తాను అనుకుంటున్నానని దిమిత్రి తెలిపారు.

మరోవైపు..ట్రంప్, మస్క్ ల మధ్య నెలకొన్న వివాదంపై జోక్యం చేసుకునేందుకు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ నిరాకరించారు. ఇది యూఎస్ సమస్య అని, తమకు ఇందులో జోక్యం చేసుకొనే ఉద్దేశం లేదని వ్యాఖ్యానించారు. అధ్యక్షుడే స్వయంగా ఈ సమస్యను పరిష్కరించుకుంటారని తాము అనుకుంటున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. నిజానికి ట్రంప్, మస్క్ సంబంధాలు కొంతకాలంగా ఒడిదొడుకులమయంగానే సాగుతున్నాయి. ప్రభుత్వ పనితీరుపై మస్క్ పెత్తనం మరీ మితిమీరుతోందని ట్రంప్ బృందం ఆక్షేపిస్తూ వస్తోంది. ఆ క్రమంలో ట్రంప్ గద్దెనెక్కిన ఒకట్రెండు రోజుల నుంచే ఆయన సన్నిహితులతో మస్క్ తరచూ గొడవ పడుతూ వస్తున్నారు. వ్యవహారం శ్రుతి మించుతోందని భావించిన ట్రంప్ కూడా క్రమంగా ఆయనను దూరం పెడుతూ వచ్చారు. డోజ్ సారథిగా కేవలం 130 రోజుల కోసం జరిగిన తన నియామకాన్ని పొడిగిస్తారని మస్క్ ఆశించారని కూడా అంటారు. అలాంటి సూచనలు కన్పించకపోవడంతో ఇటీవల ఆయనే తప్పుకున్నారు. ట్రంప్ ఇటీవల తెరపైకి తెచ్చిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్'ను తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వ వ్యయానికి కత్తెర వేస్తానని గొప్పలు చెప్పుకున్న పెద్దమనిషి చివరికిలా భారీ దుబారాకు వీలు కల్పించే బిల్లుకు రూపమిచ్చారంటూ నిప్పులు చెరిగారు. దాంతో అప్పటిదాకా సంయమనం పాటిస్తూ వచ్చిన ట్రంప్ కూడా శషభిషలన్నీ పక్కనపెట్టి మస్క్ పై విరుచుకుపడ్డారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు మావోలు మృతి




**ఛత్తీస్‌గఢ్:** బీజాపూర్‌లోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రత బలగాల కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. తెలుగు నేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కొనసాగుతుంది. మూడో రోజు మరో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. వారి మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఘటన స్థలంలో రెండు ఏకే 47 రైఫిళ్లు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంద్రావతి టైగర్ రిజర్వ్‌లో మూడు రోజులుగా మావోయిస్టులకు, భద్రత బలగాలకు మధ్య ఎదురు కాల్పులు జరుగుతున్నాయి. భద్రత బలగాల హిట్ లిస్టులో తెలంగాణ ప్రాంతానికి చెందిన కీలక నేతలు బండి ప్రకాష్, దామోదర్, మల్లోజుల వేణుగోపాల్, రామన్న, వాసుదేవరావు ఉన్నారు. మరోవైపు మావో కీలక నేతలు బండి ప్రకాష్ , దిలీప్‌లకు ప్రాణహాని ఉందని పౌర హక్కుల సంఘాల నేతలు అంటున్నారు. ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చే ప్రమాదం ఉందని పౌర హక్కుల సంఘం నేతలు చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్ర నేతలు నంబాల కేశవరావు, సుధాకర్ ప్రాణాలు కోల్పోయారు. నిన్న జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన మైలారపు ఆడేళ్లు అలియాస్ భాస్కర్ ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 5 నుంచి జరుగుతున్న ఎదురు కాల్పుల్లో మొత్తం ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపూర్ ఎస్పీ వెల్లడించారు. మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇందులో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించాల్సి ఉందన్నారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి రెండు ఏకే 47 రైఫిళ్లు సహా పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రదేశంలో సెర్చింగ్ జరుగుతుంది. పాము కాటు, తేనెటీగల దాడిలో కొందరు జవాన్లు అస్వస్థతకు గురయ్యారు. డీహైడ్రేషన్‌తో మరి కొందరు జవాన్లకు అస్వస్థతకు గురయ్యారు. బలగాల ఆపరేషన్ ముగిసిన తర్వాత సమగ్ర సమాచారం తెలియ చేస్తామని బీజాపూర్ ఎస్పీ పేర్కొన్నారు.

## కన్నప్పకి కష్టాలు.. సినిమాని అడ్డుకుంటామంటూ
# బ్రాహ్మణ సంఘాలు వార్నింగ్



మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్పకి అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. కన్నప్ప చిత్రం జూన్ 27న విడుదల కానుండగా, ఈ సినిమాని అడ్డుకుంటామంటూ తాజాగా బ్రాహ్మణ సంఘాలు పిలుపునిచ్చాయి. కన్నప్ప సినిమాలో పిలక గిలక పాత్రపై బ్రాహ్మణ సంఘాలు మండిపడుతున్నాయి. గుంటూరులో ఇవాళ(శనివారం) కన్నప్ప సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని అడ్డుకుంటామని బ్రాహ్మణ సంఘాలు హెచ్చరిస్తున్నాయి.. ఈ మేరకు బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు శ్రీధర్ ఓ ప్రకటన కూడా విడుదల చేశారు. మంచు మోహన్ బాబు కుటుంబానికి బ్రాహ్మణులని అవమానించడం అలవాటేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ చాలా సినిమాల్లో బ్రాహ్మణులను కించపరిచిన వారు కన్నప్ప సినిమాలో పిలక గిలక పాత్ర పెట్టారు. ఈ పాత్రపై ఈ రోజు జరిగే ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో స్పష్టత ఇవ్వకపోతే కోర్టును ఆశ్రయించి సినిమాని అడ్డుకుంటామంటూ హెచ్చరించారు. బ్రాహ్మణులను కించపరిచే విధంగా పాత్రలతో సినిమాలు నిర్మించడం ఇప్పటికైనా మంచు మోహన్‌బాబు కుటుంబం మానుకోవాలంటూ శ్రీధర్ ధ్వజమెత్తారు. దీనిపై చిత్ర యూనిట్ వారు ఆలోచన చేయాలని అన్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో కన్నప్ప నుండి పిలక గిలక అనే హాస్య పాత్రలని పరిచయం చేశారు. ఇందులో బ్రహ్మానందం, సప్తగిరి ఉన్నారు. పోస్టర్‌లో చేపకు ఈత, పులికి వేట, కోకిలకి పాట...నేర్పిన గురువులు.. అడవికే పాఠాలు చెప్పడానికి వస్తే.. అనే డైలాగ్ కూడా రివీల్ చేశారు. ఇప్పుడు ఇవే తమ మనోభావాలని కించపరుస్తున్నాయంటూ బ్రాహ్మణ సంఘాలు మండిపడుతున్నాయి. ఇక విడుదలకు సిద్ధంగా ఉన్న 'కన్నప్ప' మూవీ ఫైనల్ కాపీపై మంచు మోహన్ బాబు, మంచు విష్ణు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఫైనల్ కాపీ సిద్ధం కావడంతో ఆ కాపీని ప్రసాద్ ల్యాబ్స్‌లో మంచు మోహన్ బాబు, విష్ణు వీక్షించారు. ఫైనల్ కాపీ విషయంలో మోహన్ బాబు, విష్ణు సంతృప్తి వ్యక్తం చేసినట్లు మూవీ టీమ్ చెబుతోంది. త్వరలో ట్రైలర్ విడుదల కార్యక్రమం జరగనుండగా, ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ప్రభాస్ కూడా వస్తారనే టాక్ వినిపిస్తోంది. ఏపీలోని భీమవరం గ్రామంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగబోతోందని ప్రచారం జరుగుతుంది. ఈ సినిమాలో ప్రభాస్, మోహన్ లాల్, కాజల్, అక్షయ్ కుమార్ కీలక పాత్రల్లో నటించారు.



## ఈ వెధవ నన్ను వదిలేశాడు..
# ఎంతగానో ఏడ్చా..

పెళ్లికి ముందు ప్రేమలు ఇప్పుడు కామన్ అయిపోయాయి. అయితే ఎన్ని లవ్‌స్టోరీలు ఉన్నా సరే పెళ్లి దగ్గరపడేసరికి వాటిన్నింటికీ ముగింపు పలికేసి కొత్త జీవితం మొదలుపెడుతున్నారు. బాలీవుడ్‌లో ఈ ట్రెండ్ ఎప్పటినుంచో ఉంది! ఎంతోమంది హీరో, హీరోయిన్లు అనేక లవ్వాయణాల తర్వాతే వైవాహిక బంధంలో అడుగుపెట్టారు.

**పెళ్లికి ముందు ప్రేమాయణం**

స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా (Priyanka Chopra).. నటుడు హర్మాన్ బవేజా, షాహిద్ కపూర్, షారూఖ్ కపూర్‌ను ప్రేమించినట్లు భోగట్టా! ఆ తర్వాతే అమెరికన్ సింగర్, నటుడు నిక్ జోనస్ (Nick Jonas)తో ప్రేమలో పడగా ఈసారి దాన్ని పెళ్లిదాకా తీసుకెళ్లింది. అయితే నిక్ కూడా గతంలో అమెరికన్ సింగర్, నటి మిలే సైరస్‌ను ప్రేమించాడు. వీరిద్దరూ 2006 2009 వరకు డేటింగ్‌లో ఉన్నారు. ఆ తర్వాత ఆమెకు బ్రేకప్ చెప్పి ప్రియాంకను పెళ్లి చేసుకుని జీవితంలో సెటిలయ్యాడు.

**నన్ను దూరం పెట్టాడు**

తాజాగా తన ప్రేమపురాణం గురించి సైరస్ (Miley Cyrus) ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. నాకు నిక్ అంటే చాలా ఇష్టం. నన్ను తన మ్యూజిక్ టూర్‌లో జాయిన్ చేసుకోనప్పుడు ఎంతో బాధపడ్డాను. ఏడ్చాను. తను నన్ను నెమ్మదిగా దూరం పెడుతున్నాడని అర్థమైంది. ఎందుకు నన్ను వదిలేస్తున్నావ్? అని నిలదీశాను. కలిసుందామని వేడుకున్నాను. కానీ ఫలితం లేకపోయింది.

**వెధవ.. నన్ను వదిలేశాడు**

నా బయోగ్రఫీలో కూడా నిక్ మంచివాడు కాదు, వెధవ.. నన్ను వదిలేశాడని బూతులు రాయాలనుకున్నాను. కానీ నా టీమ్ అతడ్ని తిడుతూ రాసేందుకు ఒప్పుకోలేదు. అయితే నిక్ ఇప్పటికీ దారితప్పిన పిల్లాడిలాగే కనిపిస్తాడు అని నవ్వేసింది. ఇకపోతే సైరస్ 2021 నుంచి మాక్స్ మొరండోతో డేటింగ్‌లో ఉంది. నిక్ విషయానికి వస్తే.. ప్రియాంకను పెళ్లి చేసుకోగా వీరికి సరోగసి ద్వారా మూడేళ్ల కూతురు మాల్తీ మారీ జన్మించింది.

# పాన్ వరల్డ్ హీరోయిన్ రీఎంట్రీ..



మలయాళంలో హీరోయిన్‌గా రంగప్రవేశం చేసి, టాలీవుడ్, కోలీవుడ్‌లను దాటి ఉత్తరాది భాషల్లోనూ తనకంటూ స్టార్ ఇమేజ్‌ను సంపాదించుకున్న తెలుగింటి ఆడపడుచు రంభ. సర్గం (1992) అనే మలయాళ చిత్రం ద్వారా కథానాయకిగా రంగప్రవేశం చేసిన ఈ బ్యూటీ అదే ఏడాదిలో తెలుగులో కూడా ఎంట్రీ ఇచ్చేశారు. ఆపై తమిళం, కన్నడం, మలయాళం, హిందీ, బెంగాలీ, బోజ్‌పురి, ఆంగ్లం మొదలగు 8 భాషల్లో నటించి అప్పట్లోనే పాన్ వరల్డ్ కథానాయకిగా వెలిగారు. అలా రెండు దశాబ్దాలకు పైగా అగ్ర కథానాయకిగా రాణించిన రంభ చివరిగా తమిళంలో పెణ్ సింగం (2010) అనే చిత్రంలో గెస్ట్ అప్పియరెన్స్ ఇచ్చారు. అలా 100కు పైగా చిత్రాల్లో నటించిన ఈమె 2010లో కెనడాకు చెందిన ఇంద్రకుమార్ పద్మనాథన్ అనే పారిశ్రామిక వేత్తను పెళ్లాడారు. ఆ తరువాత కూడా కొన్ని చిత్రాల్లో నటించిన రంభ 2017 తరువాత నటనకు దూరమయ్యారు. కాగా 49 ఏళ్ల రంభ ఇప్పుడు చెన్నైకి మకామ్ మార్చి మళ్లీ సినిమాలపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ నటించాలా, నిర్మాతగా చిత్రాలు నిర్మించాలా అనే సందిగ్ధంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈమె ఇంతకుముందు చిత్ర నిర్మాణం ప్రారంభించి త్రీ రోజెస్ అనే చిత్రాన్ని నిర్మించారన్నది తెలిసిందే. అయితే, ఆ చిత్రం రంభను నిరాశపరచింది. కొందరు దర్శకులు మాత్రం రంభ నిర్మించే చిత్రాలకు పనిచేయాలని ఆశపడుతున్నట్లు టాక్.. కారణం ఆమె భర్త వేల కోట్లకు అధిపతి కావడమేననే టాక్ మరో పక్క సామాజక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇకపోతే ఒక తమిళ చిత్రంలో పార్థిబన్, రంభ కలిసి నటించారు. అలా షూటింగ్‌కు వచ్చిన ఆమెను చూసిన పార్థిబన్‌తో పాటు తదితర సినీ ప్రముఖులు రంభ సార్ అంటూ ఆమెను తెగ అభిమానిస్తూ చుట్టుముట్టేశారు.

## స్టన్నింగ్ లుక్
# హాట్ కిక్



సోషల్ మీడియాలో సోకుల వల వేయడంలో బాలీవుడ్ బ్యూటీ దిశా పటాని (Disha Patani) రూటే సపరేటు. సామజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటూ ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫోటోషూట్స్ షేర్ చేస్తుండటం ఎప్పటినుంచో హ్యాబీగా పెట్టుకుంది దిశా పటానీ. ఇదే బాటలో తాజాగా స్టన్నింగ్ లుక్స్ వదిలింది యంగ్ అండ్ హాట్ లేడీ దిశా పటాని. టాప్ అందాలు చూపిస్తూ కుర్రకారులో సెగలు పుట్టించింది. దీంతో ఈ అమ్మడు షేర్ చేసిన ఫొటోస్ వైరల్ అవుతున్నాయి. యువతకు అందాల గాలం వేస్తూ ఫాలోయింగ్ పెంచుకుంటోంది. తరచూ బికినీల్లో కనిపిస్తూ అభిమానుల మతి పోగొడుతోంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ అమ్మడు తన ఇన్స్ స్టా వేదికగా షేర్ చేసిన కొన్ని ఫొటోస్ నెట్టింట హీటు పెంచాయి. 2016లో వచ్చిన ఎమ్మెస్ ధోనీ (MS Dhoni) అన్‌టోల్డ్ లవ్‌స్టోరీ సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన దిశా పటానీ ఆ తర్వాత పలు సినిమాల్లో భాగమవుతూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. భాగీ, భారత్, మలంగ్‌లాంటి సినిమాలతో ఆమె క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. సోషల్ మీడియానే అస్త్రంగా చేసుకొని తన పాపులారిటీ పెంచుకుంటోంది దిశా. ఎప్పటికప్పుడు పరువాల విందు ఇస్తూ ఫాలోయింగ్ రెట్టింపు చేసుకుంటోంది. సామాజిక మాధ్యమాల్లో దిశా పటాని క్రేజే వేరు అని ఆమె ఫాలోవర్స్ సంఖ్య చూస్తే అర్థం చేసుకోవచ్చు. యాక్టింగ్ కంటే ఎక్కువగా గ్లామర్, ఎఫైర్ వ్యవహారాలతోనే బాగా గుర్తింపు పొందింది దిశా పటాని. బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ తో దిశా డేటింగ్ వ్యవహారం బాలీవుడ్‌లో ఎప్పటికీ హాట్ టాపికే. ఈ ఇద్దరికి సంబంధించిన ఎన్నో ఫొటోస్ ఆన్‌లైన్ మాధ్యమాలపై వైరల్ అయి జనాల్లో పలు చర్చలకు తావిచ్చాయి. లోఫర్ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయమైన దిశా పటాని.. ఇక్కడి ఆడియన్స్ పల్స్ పట్టేసింది. వెండితెరపై గ్లామర్ ట్రీట్ ఇచ్చి తెలుగు ప్రేక్షకుల మనసు దోచేసింది. మరిన్ని తెలుగు సినిమాల్లో అవకాశాలు పట్టేయాలని దిశా గట్టిగానే ప్రయత్నిస్తోంది. రీసెంట్‌గా ప్రభాస్ హీరోగా వచ్చిన భారీ సినిమా ప్రాజెక్ట్ K మూవీలో దిశా భాగమైంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో విడుదలైన ఈ సినిమా దేశవ్యాప్తంగా భారీ రేంజ్ వసూళ్లు రాబట్టింది. తాజాగా మరోసారి ప్రభాస్ కొత్త సినిమాలో ఈ బ్యూటీకి ఛాన్స్ వచ్చిందని టాక్.

# టాలీవుడ్ సమస్యలు తీర్చేందుకు కొత్త కమిటీ..

**హైదరాబాద్:**




వెలవెలబోతున్న థియేటర్లు, నెలరోజుల్లోనే ఓటీటీ (OTT)లోకి సినిమాలు, సినిమా రిలీజ్ కష్టాలు.. ఇలా తెలుగు చలనచిత్ర పరిశ్రమ (Tollywood)ను ఎన్నో ఇబ్బందులు చుట్టుముట్టాయి. వీటి పరిష్కారానికి అంతర్గత కమిటీ ఏర్పాటైంది. తెలుగు సినీ పరిశ్రమలో కొంతకాలంగా ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి తెలుగు ఫిలిం ఛాంబర్.. అంతర్గత కమిటీ ఏర్పాటు చేసింది. ఇందులో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ విభాగాల నుంచి పది మంది చొప్పున సభ్యులుగా తీసుకుంది. మొత్తం 30 మంది సభ్యులతో ఈ కమిటీ ఏర్పాటైంది. దీనికి ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఫిలిం ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్ కమిటీ కన్వీనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు.

**ఏ విభాగంలో ఎవరున్నారంటే?**

నిర్మాతల విభాగం: దిల్ రాజు, దామోదర ప్రసాద్, ప్రసన్నకుమార్, సి.కళ్యాణ్, రవి కిశోర్, రవిశంకర్, నాగవంశీ, దానయ్య, స్వప్నదత్, సుప్రియ

**డిస్ట్రిబ్యూటర్ విభాగం:**

భరత్ భూషణ్, సుధాకర్ రెడ్డి, ఎం.సుధాకర్, శిరీశ్ రెడ్డి, వెంకటేశ్ రావు, రాందాస్, నాగార్జున, సీడెడ్ కుమార్, భరత్ చౌదరి

**ఎగ్జిబిటర్ విభాగం:**

రాంప్రసాద్, సురేష్ బాబు, సునీల్ నారంగ్, వీర నారాయణబాబు, శ్రీనివాసరావు, అనుపమ్ రెడ్డి, బాలగోవిందరాజు, మహేశ్వర రెడ్డి, శివప్రసాద్ రావు, విజయేందర్ రెడ్డి.

## ప్రేమ కవిత్వంలో 8 వసంతాలు..
# టీజర్ విడుదల



అందమైన ప్రేమకథతో వస్తున్న చిత్రం '8 వసంతాలు'.. తాజాగా ఈ మూవీ నుంచి రెండో టీజర్‌ను విడుదల చేశారు. మ్యాడ్ సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో గుర్తింపు తెచ్చుకున్న అనంతిక సానీల్‌కుమార్ ఇందులో హీరోయిన్‌గా నటిస్తుంది. మైత్రీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఫణీంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగులో సూపర్ హిట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా గుర్తింపు పొందిన హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. జూన్ 20న ఈ చిత్రం విడుదల కానుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com